

మంత్రులకు..ర్యాంకులు

మంత్రుల పనితీరుకే కాదు.. ఫైల్స్ క్లియరెన్స్‌కు ర్యాంకులు ఉంటాయి.. తాజాగా ఆ ర్యాంకులను కేటాయించారు. ఇటీవల సీఎం చంద్రబాబు రాష్ట్ర మంత్రులు తమ శాఖల పరిధిలో ఫైళ్లను ఎప్పటికప్పుడు వేగంగా పరిష్కరించాలని దిశానిర్దేశం చేశారు. ఈ మేరకు గురువారం జరిగిన కేబినెట్ సమావేశంలో దీనిపై చర్చించారు. అనంతరం ఫైళ్ల క్లియరెన్స్‌లో మంత్రుల పనితీరు ఎలా ఉందనేదానిపై సీఎం ర్యాంకులు ప్రకటించారు. అందులో భాగంగా తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న కందుల దుర్గేష్ రెండో ర్యాంకులో నిలిచారు.. కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పదో ర్యాంకు.. బీఆర్ అంబేడ్కర్ జిల్లా రామచంద్రపురం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న వాసంశెట్టి సుభాష్ 25 ర్యాంకులో నిలిచారు. ఈ ర్యాంకులను కేబినెట్ సమావేశంలో సీఎం చంద్ర బాబునాయుడు స్వయంగా ప్రకటించడం గమనార్హం.

మంత్రి దుర్గేష్ — 2



రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి) : ఫైళ్ల క్లియరెన్స్‌లో తూర్పు గోదావరి జిల్లా నిడదవోలు నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్‌కు 2వ ర్యాంకు లభించింది.కూటమి ప్రభుత్వంలో మంత్రులుగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఏ మంత్రి ఎన్ని ఫైళ్లు క్లియర్ చేశారనే దానిపై సీఎం చంద్రబాబు ర్యాంక్‌లు ప్రకటించారు. అందులో మంత్రి కందుల దుర్గేష్‌కు 2వ ర్యాంకు లభించింది.దీనిపై ఆయనను సంప్రదించగా బాధ్యతలు చేపట్టిన తరువాత ఏడు నెలల్లో సుమారు 120 ఫైళ్లు క్లియర్ చేసినట్టు చెప్పారు. తాను పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీశాఖలకు సంబంధించిన ఫైళ్లను క్లియర్ చేశానని, అందులో టూరిజం శాఖకు చెందినవే అధికంగా ఉన్నాయన్నారు. మరింత ఉత్సాహంగా పనిచేయడానికి ఈ ర్యాంకు ప్రోత్సాహాన్నిస్తుందని చెప్పారు.

పవన్‌కల్యాణ్ — 10



కాకినాడ, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : జనసేన అధినేత, డిప్యూటీ సీఎం, పంచాయతీ రాజ్,గ్రామీణాభివృద్ధి, అటవీ, పర్యావరణ,సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రి కొణిదల పవన్‌కల్యాణ్ ఫైళ్ల క్లియరెన్స్‌లో 10వ ర్యాంకులో నిలిచారు..పవన్ కల్యాణ్ కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. మంత్రుల ఫైళ్ల క్లియరెన్స్‌పై సీఎం ర్యాంకులు ప్రకటించారు. అందులో భాగంగా డిప్యూటీ సీఎం, మంత్రి పవన్ కల్యాణ్ పదో ర్యాంకులో నిలిచారు. ఇకపై మరింత వేగవంతమైన పనితీరు అందించే క్రమంలో మంత్రులు చురుగ్గా వ్యవహరించాలని సీఎం ఆదేశించారు. పవన్‌కల్యాణ్ అత్యంత కీలకమైన శాఖలు చూస్తున్నారు. వీటికి సంబంధించి ఎప్పటికప్పుడు ఫైళ్లను క్షుణ్ణంగా అధ్యయనం చేసి వాటిని పరిష్కరిస్తున్నారు. అలాగే రాష్ట్ర వ్యాప్తంగా తరచూ పర్యటిస్తూ బిజీబిజీగా గడుపుతున్నారు.ఈ నేపథ్యంలో ఫైళ్ల క్లియరెన్స్‌కు కాస్త ఆలస్యం అవుతున్నా వాటిని పూర్తిగా అధ్యయనం చేస్తున్నారు.

సుభాష్ — 25



అమలాపురం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం నుంచి కార్మికశాఖ మంత్రిగా ప్రాతినిధ్యం వహిస్తున్న వాసంశెట్టి సుభాష్ ఫైళ్ల క్రియరెన్సులో చివరిస్థానం 25లో నిలిచారు.కోనసీమకు చెందిన మంత్రి సుభాష్ ఫైళ్ల పరిష్కారంలో చివరిస్థానంలో ఉండడంతో చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికే పార్టీ సభ్యత్వ నమోదు విషయంలో ఒకసారి అధినేత చంద్రబాబునాయుడుతో మందలింపునకు గురైన విషయం పాఠకులకు విదితమే. ఈ నేపథ్యంలో ర్యాంకుల్లోనూ చివర నిలవడంతో మంత్రి సుభాష్ రాగల రోజుల్లో మరింత కష్టించి పనిచేయాల్సి ఉంటుందని ఆయన సన్నిహితులు సూచనలు చేస్తున్నారు. సుభాష్ పనితీరు పట్ల కొన్నివర్గాలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్టు సమాచారం.



అవినీతి.. రత్నాలు!

రత్నగిరిపై అవినీతి రత్నాలు ఉన్నాయి.. ఏళ్లుగా పాతుకుపోయాయి. గత వైసీపీ ప్రభుత్వంలోనే విజిలెన్స్ అధికారులు వీళ్ల లెక్క తీశారు.. అయినా గత ప్రభుత్వంలో షరా మామూలుగా చర్యల్లేవ్.. ఎన్నికలు రావడం.. ప్రభుత్వం మారడంతో.. ఆ అవినీతి ఫైల్ కూటమి ప్రభుత్వం వద్దకు చేరింది.. ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు అవుతున్నా సత్యదేవుడి చెంత అసత్యం నిగ్గు తేల్చడానికి ఏ ఒక్కరూ ముందుకు రాలేదు.. ప్రాధాన్యత ఉన్న ఆలయంలో ఏళ్లు గడుస్తున్నా అక్రమార్కులపై కనీస చర్యలు లేకపోవడంతో దొంగలంతా దర్జాగా తిరుగుతున్నారు. కొండపై ప్రక్షాళన వట్టిమాటే అన్నట్టు ధీమా ప్రదర్శిస్తూ కూటమిలోనూ చక్రం తిప్పుతున్నారు.

రత్నగిరి కొండపై అక్రమాలకు అడ్డేది

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

అన్నవరం దేవస్థానంలో అవినీతి గుట్టు బయట పడినా అక్రమార్కులపై ఇప్పటికీ చర్యలకు అడుగులు పడడం లేదు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొత్తలో కచ్చితంగా చర్యలు ఉంటాయని భావించినా ఇంకా ఆ దిశగా ప్రక్షాళన జరగకపోవడం చర్చనీయాంశంగా మారింది. కొండపై పలు రకాల అవినీతి,అక్రమాలు పేరుకుపోయాయని సాక్ష్యా ఆధారాలతో విజిలెన్స్ నివేదిక తయారు చేసి పంపినా గత ప్రభుత్వం కనీసం పట్టించుకోలేదు. పైగా ఇవన్నీ బయట పడితే కొలువులు పోతాయని కొందరు కీలక అధికారులు బెంబేలెత్తిపోయారు. అక్రమాలపై చర్యలు లేకుండా అప్పట్లో తెగ చక్రం తిప్పారు. అయితే కూటమి ప్రభుత్వం రావడం తో విజిలెన్స్ నివేదిక ప్రకారం చర్యలు ఉంటాయని భావిస్తే ఇప్పటికీ సదరు అక్రమార్కులు ఆ నివేదిక బయటకు రాకుండా ప్రభుత్వం కళ్లకు గంతలు కట్టడానికి ప్రయత్నిస్తుండడం విశేషం. మరో పక్క అప్పటి నివేదికలను విజిలెన్స్ అధికారులు కొత్త ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు. కానీ ఇప్పటికీ అక్రమార్కులపై చర్యలకు దిక్కుదివానం లేదు. వాస్తవానికి కొండపై అడ్డగోలుగా ఉద్యోగుల భర్తీ, పదోన్నతులు, దుకాణాల లీజులు,ఈవో బంగ్లా నిర్మాణం వరకు అక్రమాలు జరిగినట్టు విజిలెన్స్ తేల్చింది.

ఇన్నేళ్లయినా.. చర్యలేవి!

అన్నవరం దేవస్థానంలో 2019 నుంచి పలు విభాగాల్లో అక్రమాలు భారీగా చోటుచేసుకున్నాయి. ఓ కీలక అధికారి, కొందరు సెక్షన్ ఉద్యోగులతో కుమ్మక్కై అర్చకులు,ఉద్యోగాల నియామకాల్లో పెద్ద ఎత్తున మేసేశారు. జీతాల పేరుతో దేవస్థానం నిధులను దిగమింగేశారు. బస్సుల నిర్వహణ, కొండ కింద ఈవో బంగ్లా నిర్మాణానికి దేవస్థానం నిధుల నుంచి రూ.కోటి వరకు వెచ్చించారు. గోశాల నిర్వహణలోను అక్రమాలు భారీగా ఉన్నాయి. అడిగేవారు లేరన్న ధీమాతో అప్పట్లో కొందరు అధికారులు, ఉద్యోగులు కలిసి దేవస్థానం సొమ్ములు మింగేశారు. వీటన్నింటిపైనా భక్తుల నుంచి 2021లో అప్పటి ప్రభుత్వానికి భారీగా ఫిర్యాదులు వెళ్లాయి.ఈ నేపథ్యంలో కొండపై అవినీతి భాగోతం తేల్చడానికి సీఎం కార్యాలయం ఆదేశాలతో విజిలెన్స్ అధికారులు రంగంలో దిగారు. 2021 డిసెంబరు 20 నుంచి విజిలెన్స్ ఎస్పీ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు కొండపై కొన్నిరోజులు దాడులు నిర్వహించాయి. ట్రాన్స్‌పోర్టు,ఉద్యోగుల భర్తీకి సంబంధించి సెక్షన్లలో కీలక అధికారులు,ఉద్యోగుల నుంచి వివరణలు రికార్డు చేసుకున్నారు. దేవ స్థానంలో అక్రమ నియామకాలు, పదోన్నతులు, లీజుల విభాగంలో అక్రమాలు, ఈవో క్వార్టర్ నిర్మాణంలో భారీగా ఆలయ నిధులు మింగేశారనే అంశాలపైనా విచారణ చేపట్టారు.ఈ ఖర్చులకు సంబంధించిన బిల్లులు,ఇతర రికార్డులను విజిలెన్స్ పరిశీలించింది. దేవస్థానానికి సమీపంలో నిర్మాణంలో ఉన్న కొన్ని భవనాల కొలతలు తీసుకున్నారు.ఆ తర్వాత ప్రభుత్వానికి 2022లో విజిలెన్స్ పూర్తి నివేదిక పంపింది. కొండపై అనేక అవినీతి, అక్రమాలు జరిగినట్టు తేల్చింది. రౌతులపూడి మండలం గొందిలో ఆలయానికి 38 ఎకరాల భూమి ఉండగా దానిలో చాలా వరకు అక్రమార్కులు పాగా వేసే శారని దీనికి కొందరు అధికారుల సహకారం ఉందని వివరించింది.బాధ్యులందరిపై చర్యలు తీసుకోవాలని పేర్కొంది.ఈ నివేదికపై చర్యలు తీసుకుంటే కొలువు పోతుందనే భయంతో ఇక్కడ ఈవోగా పనిచేసి వెళ్లిపోయిన సదరు కీలక అధికారి విజిలెన్స్ నివేదికపై చర్యలు లేకుండా అప్పటి ప్రభుత్వ పెద్దలను దారికి తెచ్చుకున్నారు. దీంతో అక్రమాలు బయటపడినా నివేదికను తొక్కి పెట్టేసేలా చేయగలిగారు. అటు ప్రభుత్వం నుంచి ఏమాత్రం స్పందన లేకపోవడంతో విజిలెన్స్ సైతం నెమ్మదిగా ఉండిపోయింది.

ఇప్పుడూ అంతే..చర్యల్లేవంతే..

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చి ఏడు నెలలు పైగానే అయిపోయింది. అయినా ఇప్పటికీ అక్రమార్కులపై చర్యలు లేవు. వాస్తవానికి ప్రభుత్వం వచ్చిన కొత్తలో విజిలెన్స్ అధికారులు గత ప్రభుత్వంలో అక్రమాలకు సంబంధించి అన్ని వివరాలు అందించారు.అయినా ఇప్పటికీ అక్రమార్కులపై చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. కూటమి ప్రభుత్వంలోను సదరు కీలక అధికారి చక్రం తిప్పుతున్నారనే అనుమానాలున్నాయి.ప్రత్తిపాడు,తుని ఎమ్మెల్యేలు అసెంబ్లీలో అన్నవరం దేవస్థానం అక్రమాలపై విజిలెన్స్ నివేదికలు ఏమయ్యాయని నిలదీసి ఉంటే ఈ పాటికి చర్యలకు అవకాశం ఉండేది.కానీ ఈ దిశగా ప్రయత్నాలు లేకపోవడంతో దొంగలు కొండపై తమ దందాలు సాగిస్తున్నారు.విజిలెన్స్ నివేదికను రప్పించుకుని అక్రమార్కులపై చర్యలు తీసుకునేలా కలెక్టర్ అయినా చొరవ తీసుకోవాల్సి ఉంది.

- అన్నవరంలో అక్రమాలపై నివేదిక
- గత ప్రభుత్వంలో విజిలెన్స్ దాడులు
- నిధుల దుర్వినియోగంపై తేల్చివేత
- గొంది ఆలయ భూములు కబ్జా
- 38 ఎకరాలపై విన్నపం
- ఏళ్లు గడుస్తున్నా మౌనమే
- కూటమిలోనూ అక్రమార్కుల దర్జా
- విజిలెన్స్ నివేదికపై నేటికీ చర్యల్లేవ్
- ఈ సర్కారులోనూ ఇంతేనా?
- ఇప్పటికీ చక్రం తిప్పుతున్న వైనం

రేపటి నుంచి ధవళగిరి జనార్దనుడి
కల్యాణోత్సవాలు 6

ప్రతి గ్రామంలో మోడల్ స్కూల్ ఉండాలి

విద్యాశాఖ సమీక్షలో కలెక్టర్

రాజమహేంద్రవరం,ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో డ్రాపవుట్స్ లేకుండా చర్యలు తీసుకోవడంతో పాటు ప్రతి గ్రామంలో ఒక మోడల్ ప్రైమరీ స్కూల్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. విద్యాశాఖపై గురువారం ఆమె సమీక్షించారు. ప్రభుత్వ పాఠశాలల్లో డ్రాపవుట్స్ లేకుండా చూడడంలో భాగంగా ఏకీకృత జిల్లా సమాచార వ్యవస్థ(యూడైస్) డేటా, ఫిజికల్ వెరిఫికేషన్ డేటా ఆధారంగా విద్యార్థి వారీగా వివరాలను విశ్లేషణ చేయాలని సూచించారు. గ్రామ స్థాయిలో అంగన్‌వాడీ కేంద్రాలతో ఫౌండేషన్ స్కూల్స్‌ని అనుసంధానం చేయడం ద్వారా అప్ గ్రేడ్ చేస్తే అదనపు బోధనా సిబ్బంది అందుబాటులోకి రావడం సాధ్యమవుతుందన్నారు. సంబంధిత అధికారులు డ్రాపవుట్‌గా ఉన్న విద్యార్థి ఇంటికి వెళ్లి అవగాహన కల్పించి పాఠశాలకు వచ్చే విధంగా చూడాలన్నారు.ఈ కార్యక్రమంలో డీఈవో కె.వాసుదేవరావు, ఎస్ఎస్ఏ పీడీ సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

నీరు -చెట్టు పెండింగ్ బిల్లుల క్లియరెన్స్‌కు సీఎం ఆదేశం

జిల్లాలో 90 బిల్లులకు పెండింగ్

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి6 (ఆంధ్రజ్యోతి) : నీరు చెట్టు పథకం కింద 2019కు ముందు చేసిన పనులకు బిల్లులు చెల్లించకుండా గత వైసీపీ ప్రభుత్వం కాంట్రాక్టర్లను తీవ్ర ఇబ్బందులకు గురి చేసిన సంగతి తెలిసిందే. దీంతో ఇరిగేషన్‌లో పనులంటేనే కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రాని పరిస్థితి ఏర్పడింది. ధవళేశ్వరం ఇరిగేషన్ సర్కిల్ పరిధిలో సుమారు రూ.5 కోట్ల విలువైన 90 బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. కాంట్రాక్టర్ల బాధలు అర్థం చేసుకున్న సీఎం చంద్రబాబు నాయుడు గురువారం జరిగిన కేబినెట్‌లో ఈ అంశంపై చర్చించారు. ఆయా కాంట్రాక్టర్లకు వెంటనే బిల్లులు చెల్లించాలని అధికారులను ఆదేశించారు. దీంతో కాంట్రాక్టర్లు, అధికారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కోళ్లకు..వైరస్ 7

కుక్కలతో ఇబ్బంది ఉంటే డయల్ 94940 60060

ఆరోగ్య అధికారి వినూత్న

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరాన్ని యాంటి రేబిస్ సిటీగా మార్చేందుకు తామంతా కృషి చేస్తున్నామని నగరపాలక సంస్థ ఆరోగ్యవిభాగం అధికారి డాక్టర్ వినూత్న అన్నారు. రాజమహేంద్రవరం క్వారీసెంటర్‌లోని ఏబీసీ సెంటర్‌లో గురువారం శునకాలకు యాంటి రేబిస్ టీకాలు వేసే కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. నగరంలోని 50 డివిజన్లను కవర్ చేస్తూ వ్యాక్సిన్లు వేయడం జరుగుతుందన్నారు. ఎక్కడ ఏ ఇబ్బంది ఉన్నా 94940 60060 టోల్ ఫ్రీ నెంబరుకు ఫోను చేసి సమాచారం అందించాలన్నారు. ఏబీసీ సెంటర్‌లో రోజుకు 10 నుంచి 30 వరకు సర్జరీలు చేయడం జరుగుతుందన్నారు.ఏబీసీ ప్రాజెక్టు ఇన్‌చార్జి డాక్టర్ బి.అరుణదేవి శునకాలకు వ్యాక్సిన్ వేసి మాట్లాడారు.వేసవి కాలం ప్రారంభంలో కుక్కలకు రేబిస్ అధికంగా వ్యాప్తి చెందే అవకాశం ఉందన్నారు.దానిని నిర్మూలించడానికి మెగా యాంటి రేబిస్ వ్యాక్సినేషన్ డ్రైవ్‌కి శ్రీకారం చుట్టామన్నారు. 2025 ఉచిత మిషన్ రేబిస్ అనే నినాదంతో ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమానికి మద్దతుగా వి.గోపికాంత్ 400 ఏఆర్‌వీ డోసులు ఏబీసీ సెంటర్‌కు అందించారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ డాక్టర్ గణేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ డి సంతన రాజు, ఎస్పిసిఏ సభ్యులు వి గోపికాంత్, రాజ్ కటారియా, ఏబిసి సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.



కుక్కకు వ్యాక్సిన్ వేస్తున్న డాక్టర్ అరుణకుమారి

ధర..గిట్టుబాటు లేక!

అరటి గెల..విలవిల





దేవరపల్లి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): అరటి రైతు వెన్ను విరి గింది. గెలలు కొనేనాథుడు లేక.. కొన్నా గిట్టుబాట కాకపోవడంతో లబోదిబోమంటున్నారు. ఈ ఏడాది అరటి ధరలు అంతంతమాత్రంగానే ఉన్నాయి. కలిసిరాకపోతుందా అని రైతులు సాగుకు ఉపక్రమించారు. అయినా లాభాల్లేవ్.. రైతులను నష్టాల బాట పట్టించాయి. జిల్లా వ్యాప్తంగా కొవ్వూరు, ఉండ్రాజవరం, దేవరపల్లి, పెరవలి, గోపాలపురం, కడియం, అనపర్తి, రంగంపేట తదితర మండలాల్లో అరటి సాగు ఎక్కువగా చేస్తారు.కొవ్వూరులో చక్రకేళీ అరటిని ఎక్కువగా సాగు చేస్తారు. పెరవలి, ఉండ్రాజవరం మండలాల్లో కర్పూర, కూర అరటిగెలలు ఎక్కువగా సాగు చేస్తారు. గతంలో ఉభయ గోదావరి జిల్లాల్లో మాత్రమే అరటి సాగు ఉండేది. ఇప్పుడు విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లోనూ విపరీతంగా అరటి సాగు పెరిగింది. దీంతో ధరలు నేలచూపులు చూస్తున్నాయి. ఉత్పత్తికి తగిన డిమాండ్ లేకపోవడంతో ధరలు పెరగడంలేదు. మరోవైపు జిల్లాలోనూ రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు చూడడం లేదు. దీంతో ధర పెరిగే సూచనలు కనిపించడంలేదు. గతంలో ఉభయ గోదావరి జిల్లాల్లో మాత్రమే అరటి సాగు ఉండడంతో లాభాల పంటగా ఉండేది. నేడు ఎక్కడ పడితే అక్కడ సాగు చేస్తుండడంతో అరటి సాగు చేస్తున్న రైతులు నష్టాల బాటపడుతున్నారు. గతంలో తూర్పుగోదావరి జిల్లా నుంచి అరటి గెలలను ఒడిసా, పశ్చిమ బెంగాల్,తెలంగాణ తదితర రాష్ట్రాలకు ఎగుమతి చేసేవారు. నేడు ఎగుమతులు అంతంతమాత్రంగానే ఉన్నాయి. దీంతో గత కొన్నేళ్లుగా అరటిరైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతుంది. ఈ ఏడాది అంతే.ధరలేకపోవడంతో కర్పూరం గెలలను రైతులు పొలాల్లోనే చెట్టుకు వదిలేస్తున్నారు.మరో వైపు కూర అరటి గెలలు కొనేనాధుడే కనిపించడంలేదుని వాపోతున్నారు.గతంలో కూర అరటి గెల రూ.200 - రూ.250 వరకు ధర పలికేది. గత నవంబర్ నుంచి అరటి రూ.30 - రూ.80 మాత్రమే పలకడంతో రైతులకు కనీసం రవాణా ఛార్జీలు కూడా రాని పరిస్థితి.అయితే బయట మార్కెట్‌లో మాత్రం అరటి కాయల ధరలు దిగిరాలేదు.3 కాయలు రూ.20ల చొప్పున విక్రయించడం గమనార్హం. చక్రకేళి అరటి గెలల పరిస్థితి అలాగే ఉంది. సైకిల్ గెలలు తీసుకెళ్తుంటే రూ.500 నుంచి రూ.600 వరకూ ధర పలుకుతుందని రైతులు వాపోతున్నారు.ఎకరం అరటితోట సాగుచేయాలంటే రూ.లక్ష వరకు ఖర్చు పెట్టాల్సిందే. గెలలు కోసి మార్కెట్‌కు తరలిస్తుంటే కూలి, రవాణా ఖర్చులు కూడా రావడంలేదని రైతులు వాపోతున్నారు.

కూర గెల రూ.40



మూడెకరాల్లో కూర అరటి సాగు చేస్తున్నా. గెల మార్కెట్‌కు తరలిస్తుంటే రూ.40 - రూ.50ధర పలుకుతుంది. దీని వల్ల రవాణా, కూలీ ఛార్జీలు రాని పరిస్థితి. ధర లేక అరటి రైతులు దెబ్బ తింటున్నారు.

- ఎం.వెంకటేశ్వరరావు, అరటి రైతు, కురుకూరు

సమాజ హితం... సందేశాత్మకం

● తాటిపర్తిలో మొదలైన ఉభయ తెలుగు రాష్ట్రాల నాటిక పోటీలు



చిగురు మేఘం నాటికలో ఓ సన్నివేశం

గొల్లప్రోలు రూరల్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): సమాజంలో జరుగుతున్న పరిణామాలను వివరిస్తూ సందేశాత్మకంగా సాగాయి నాటికలు. కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం తాటిపర్తిలోని అపర్ణా కళాతోరణం బత్తుల మురళీకృష్ణ కళావేదికపై మార్కండేయ నాటక కళా పరిషత్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఉభయ తెలుగురాష్ట్రాల నాటికల పోటీల్లో తొలిరోజు ప్రదర్శించిన నాటికలు ఆలోచింపజేశాయి. వైద్య రంగంలో ప్రస్తుతం ఉన్న పరిస్థితులను గుంటూరు అమరావతి ఆర్ట్స్ కళాకారులు 'చిగురు మేఘం' నాటిక ద్వారా కళ్లకు కట్టినట్లు ప్రదర్శించారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలకు వైద్య సేవలు అందించాలనే సంకల్పంతో ఒక కొడుకు భార్యను సైతం వదిలి సొంతూరు వెళ్లిపోవడానికి సిద్ధపడ తాడు. సరైన వైద్యసేవలు అందక తల్లి చనిపోయిందన్న విషయం అతనిలో ఈ మార్పు తీసుకొస్తుంది. డబ్బు సంపాదనే ధ్యేయంగా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులు, వైద్యులు వ్యవహరిస్తున్న తీరుని ఎండగడుతూనే గ్రామాలకు వైద్యులు తరలిరావడం ద్వారా అందరికీ సకాలంలో వైద్యసేవలు అందుతాయనే సందేశాన్ని ఇచ్చింది. ఈ నాటికను కావూరి సత్యనారాయణ రచించగా ఏపూరి హరిబాబు దర్శకత్వం వహించారు. కుటుంబ వ్యవస్థలో వస్తున్న మార్పులు, అమలులో ఉన్న చట్టాలు దుర్వినియోగమవుతున్న తీరును విశాఖపట్టణం తెలుగు కళాసమితి కళాకారులు ప్రదర్శించిన 'నిశ్శబ్దం నీ ఖరీదెంత' నాటిక ద్వారా వివరించారు. సమాజంలో వివాహేతర సంబంధాలు వివాహ వ్యవస్థను చిన్నాభిన్నం చేస్తున్న తీరు, ఆ మాటున కొందరు చేస్తున్న చర్యలు అమాయకులను ఇబ్బందులకు గురిచేస్తున్న విధానాన్ని తెలియజేశారు. పీటీ మాధవ్ రచించిన ఈ నాటికకు చలసాని కృష్ణ ప్రసాద్ దర్శకత్వం వహించారు.

గిరిజనులకు పథకాలు వర్తింపజేయాలి

● టీఎస్ఎఫ్ నాయకుల డిమాండ్ ● 'నన్నయ'లో ముగిసిన గిరిజనోత్సవాలు



వేదికపై నుంచి అభివాదం చేస్తున్న టీఎస్ఎఫ్ నాయకులు

దివాన్‌చెరువు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి గిరిజన కుటుంబానికి వర్తింపచేయాలని ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ (టీఎస్ఎఫ్) జాతీయ అధ్యక్షుడు కరంసి అక్కులప్పనాయక్, టీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రాగిరి చంద్రప్ప, రాష్ట్రప్రధాన కార్యదర్శి మూడవత్ విష్ణునాయక్ కోరారు. టీఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నన్నయ విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తున్న గిరిజన సాంస్కృతిక మహోత్సవాలు గురువారంతో ముగిశాయి. టీఎస్ఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు మల్లి భాస్కర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజనుల అభివృద్ధికి అధిక నిధులు కేటాయించాలని కోరారు.

కార్యక్రమంలో టీఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రవీంద్ర నాయక్, మహిళా అధ్యక్షురాలు మధులత, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు నరేష్, రాష్ట్ర నాయకులు హేమలత, రామరాజు, వెంకటేశ్వర్లు నాయక్, రమనాథ్, రాజశేఖర్, వెంకటేష్, సుమిత్, వినోద్, లోక్యానాయక్, ప్రిన్సిపాల్ పి.విజయనిర్మల, తదితరులు పాల్గొన్నారు.

ధవళగిరిపై .. లక్ష్మీ జనార్దనుడు!



రథానికి రంగులు వేస్తున్న దృశ్యం

● రేపటి నుంచి కల్యాణోత్సవాలు ఆరంభం



ఆలయంలో కొలువుదీరిన స్వామి, అమ్మవార్లు

● ముందుగా 40 అడుగుల రథంపై ఊరేగింపు
● 13న పుష్పోత్సవంతో ముగింపు
● ఒక పక్క ఆధ్యాత్మికత.. మరో పక్క ఆహ్లాదం

ధవళేశ్వరం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ధవళేశ్వరం.. రాజమహేంద్రవరం వెళుతుంటే మధ్యలో కనిపించే చిన్నగ్రామం.. ఆ గ్రామంలో గోదావరి చెంతనే ఉంది ఒక కొండ.. ఆ కొండపై స్వయంభూగా వెలసిన దేవుడే శ్రీ భూనీళా సమేత లక్ష్మీజనార్దన స్వామి. ఆ కొండపైకి వెళితే అంతా ఆహ్లాదమే .. గోదావరి చూస్తూ.. స్వామిని దర్శనం చేసుకుంటే అంతా మనశ్శాంతి .. చాలా మందికి ఈ స్వామి గురించి అంతగా అవగాహన ఉండదు. ఒకసారి వెళ్లి దర్శించుకుంటే మళ్లీ మళ్లీ దర్శించుకోవాలనిపించేలా స్వామి ప్రతిరూపం ఉంటుంది. ఇదే కొండపై ఆంజనేయస్వామి ఆలయంలో సాక్షాత్తూ శ్రీరామచంద్రుడి పాదముద్రలు ఉన్నాయి. ఈ నెల 8వ తేదీ నుంచి ధవళగిరి లక్ష్మీ జనార్దన స్వామి కల్యాణోత్సవాలు వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. శనివారం రథోత్సవంతో మొదలయ్యే ఉత్సవాలు గురువారం పుష్పోత్సవంతో ముగుస్తాయి. ఉత్సవాల్లో భాగంగా ఆలయాన్ని ప్రత్యేకంగా ముస్తాబు చేస్తున్నారు. మెట్ల మార్గాన్ని రంగులతో, విద్యుద్దీపాలతో తీర్చిదిద్దుతున్నారు. దిగువన రామపాదాల ఘాట్ వరకు తాటాకు పందిళ్లు వేసి మామిడి తోరణాలతో అలంకరిస్తున్నారు. ఈ నెల 3న స్వామి, అమ్మవార్లను పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. 4న స్వామి వారి రథానికి పూజలు నిర్వహించి రథం అలంకారాన్ని ప్రారంభించారు. పరిసర గ్రామాల నుంచి స్వామి వారి దర్శనానికి పెద్ద ఎత్తున తరలివచ్చే భక్తులకు ఇబ్బంది లేకుండా ఆలయ అధికారులు, గ్రామపెద్దలు ఏర్పాట్లు చేస్తున్నారు.

● రథోత్సవం ప్రత్యేక ఆకర్షణ

అందంగా ముస్తాబైన భారీ రథంపై స్వామి అమ్మవార్లు ఆశీనులై గ్రామంలో ఊరేగుతూ భక్తుల అభయమిస్తూ సాగే రథోత్సవం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. ఆలయం నుంచి పోలీస్ స్టేషన్ వరకు ఉన్న రహదారి గుండా రథం ముందుకు సాగుతుంది. కిక్కిరిసిన భక్తజనం జయజయ ధ్వానాల మధ్య ఇరుకు మార్గంలో వందలాది మంది భక్తులు రథానికి రెండు వైపులా కట్టిన తాళ్లను భక్తి పారవశ్యంతో లాగుతుండగా రథం వయ్యారంగా కదులుతూ ముందుకు సాగడాన్ని కనులారా వీక్షించాల్సిందే. రథంపై ఆశీనులైన స్వామి అమ్మవార్లకు అర్పిస్తున్నట్లుగా భక్తులు అరటిపండ్లను రథం వైపు విసురుతూ తన్మయత్వం పొందుతారు. అన్ని ఆలయాల్లో స్వామి, అమ్మవార్ల కల్యాణం అనంతరం రథంపై ఊరేగిస్తుండగా ఇక్కడ రథోత్సవం తర్వాతి రాత్రి కల్యాణోత్సవాన్ని జరుపుకోవడం ప్రత్యేకం. అంతర్వేది కల్యాణోత్సవం తరువాత ధవళేశ్వరం జనార్దనుడి ఉత్సవాలు ఆరంభమవుతాయి.. తరువాత కోరుకొండ నరసింహ స్వామి కల్యాణోత్సవాలు ఆరంభమవుతాయి.

● తొలి తాంబూలం మత్స్యకారులకే

ఉత్సవాల్లో భాగంగా రథాన్ని ముందుకు నడిపించేది.. కదిలించేది మత్స్యకారులే. ముందస్తుగా మత్స్యకార పెద్దలను సత్కరిస్తారు. మత్స్య కారులకు తొలి తాంబూలం ఇచ్చిన తరువాతనే రథోత్సవం ఆరంభిస్తారు. ఇది అనాధిగా వస్తున్న ఆచారం. నేటికీ అదే ఆచారాన్ని కొనసాగిస్తున్నారు. గతంలో రథాన్ని మత్స్యకారులే లాగే వారు. ఇప్పుడు సాధారణ భక్తజనం కూడా లాగుతున్నారు..

● అతి ఎత్తయిన రథం

ఆరు అంతస్తులతో 40 అడుగుల ఎత్తు, 25 అడుగుల వెడల్పు ఉన్న ఈ రథం తెలుగు రాష్ట్రాల్లో అతి ఎత్తయిన రథంగా చెబుతారు. వందల టన్నుల బరువు ఉన్న ఈ రథానికి ఉంచిన ఆరు భారీ చక్రాలను అదుపు చేయడం ద్వారా రథ గమనాన్ని నియంత్రిస్తూ ఉంటారు. రథం దిగువున మధ్య భాగంలో అమర్చిన కప్పి వంటి నిర్మాణంతో భారీ రథాన్ని గాలిలోకి లేచే విధంగా చేసి కావాల్సిన వైపునకు సులభంగా తిప్పుతారు.

● ఉత్సవాల నిర్వహణ

ఈ నెల 8న ఏకాదశి రోజున స్వామి వారికి విశేష అర్చనలు, భక్తులకు దర్శనం. రథ సంప్రోక్షణ, కుంభ నివేదన, రథోత్సవం, ధ్వజారోహణ, అంకురార్పన, రాత్రి కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తారు. 9న గరుడ వాహన సేవ, 10న సింహవాహన సేవ, సదస్యం. 11న అశ్వావాహన సేవ, చోర సంవాదం, 12న పూర్ణాహుతి, చక్రస్నానం. చూర్ణోత్సవం, వసంతోత్సవం, ముత్యాల పల్లకీసేవ, 13న ద్వాదశ అర్చనలు, ద్వాదశ ప్రదక్షిణలు, పుష్పోత్సవాలతో ఉత్సవాలు ముగిస్తాయి

● ప్రత్యేక బందోబస్తు

శనివారం ఉదయం నుంచి స్వామి వారి దర్శనానికి వచ్చే భక్తులను నియంత్రించడంతో పాటు మధ్యాహ్నం మూడు గంటకు మొదలయ్యే రథోత్సవానికి భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్టు దక్షిణ మండలి డీఎస్పీ భవ్యకిషోర్ తెలిపారు. శని, ఆదివారాల్లో సెలవు దినాలు కావడంతో భక్తుల రద్దీ దృష్ట్యా ధవళేశ్వరం సీఐ టి.గణేష్‌తో పాటు కడియం, రాజమహేంద్రవరం సీఐలు, ఎస్ఐలు, సుమారు 50 మంది సిబ్బందితో బందోబస్తు ఏర్పాట్లు పర్యవేక్షించనున్నట్టు తెలిపారు.



రథోత్సవం (ఫైల్)



కొండకు వెళ్లే మెట్ల మార్గం

రారండోయ్.. వేడుక చూద్దాం

● నేడు అంతర్వేది లక్ష్మీనరసింహ స్వామి దివ్య కల్యాణం ● అర్ధరాత్రి 12:55 గంటలకు ముహూర్తం



విద్యుత్ దీపాల అలంకరణలో లక్ష్మీనృసింహ స్వామివారి ఆలయం

అంతర్వేది, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): బుగ్గన చుక్కతో సిగ్గులు ఒలకపోస్తూ రథసప్తమి నాడు పెండ్లి కుమారుడిగా దర్శనమిచ్చిన అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి వారు శుక్రవారం రాత్రి ఉభయ దేవేరులను పరిణయమాడేందుకు సిద్ధమయ్యారు. పంచభూతాల సాక్షిగా అఖండ జన సందోహం నడుమ ప్రతిఏటా మాఘమాసంలో కనుల పండువగా జరిగే శ్రీనారసింహుడి కల్యాణం చూసేందుకు రెండు కళ్లు చాలవు. కోరికలు తీర్చే శ్రీనారసింహుని పరిణయ ఉత్సవాలు పది రోజుల పాటు వైభవంగా జరగనున్నాయి. ఈ ఉత్సవాల్లో కీలకఘట్టమైన కల్యాణోత్సవం శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత 12:55 గంటలకు (తెల్లవారితే శనివారం) జరుగుతుంది. అధికారులు ఘనంగా ఏర్పాట్లు చేశారు.

● వైభవంగా గ్రామోత్సవాలు

కల్యాణోత్సవాల్లో భాగంగా గురువారం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం నాలుగు గంటలకు అంతర్వేదిపాలెం వాస్తవ్యులు అల్లూరి లక్ష్మీ సూర్యనారాయణరాజు వారిచే నిర్మించిన హంస వాహనంపై స్వామివారికి గ్రామోత్సవం జరిపారు. తొలుత స్వామివారిని అర్చక అలంకరణ చేసిన అనంతరం భక్తులు కొబ్బరికాయలు కొట్టి హారతులు పట్టారు. గ్రామ పురవీధుల్లో స్వామివారి ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. సాయంత్రం 6.30 గంటలకు అర్చక స్వాములు స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి ధూపసేవ అనంతరం వైభవంగా ధ్వజారోహణ నిర్వహించారు.సకల దేవతలను ఆహ్వానించడానికి ధ్వజస్తంభం వద్ద అర్చక స్వాముల నేతృత్వంలో ధ్వజారోహణ కార్యక్రమం జరిగింది. గరుత్మంతుడు చిత్రపటాన్ని ధ్వజస్తంభంపై అర్చకులు ఎగురవేశారు. రాత్రి ఎనిమిది గంటలకు కేశవదాసుపాలెం వాస్తవ్యులు గన్నాబత్తుల వెంకట రాజారావు, లక్ష్మీనరసింహస్వామి వారిచే నిర్మితమైన శేష వాహనంపై గ్రామోత్సవం జరిపారు. స్వామివారికి భక్తులు హారతులు పట్టి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ రాజా కలిదిండి కుమార రామగోపాల రాజాబహదూర్, ఉత్సవ కమిటీ చైర్మన్ దిరిశాల బాలాజీ, ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ, ఎంపీపీ వీరా మల్లి బాబు, వలవల రాంబాబు, మందపాటి వెంకటేశ్వర్లు, వనమాలి మూలాస్వామి, దాసరి వాసు, ఆకన బాబ్జినాయుడు, కొండా కిశోర్, బర్రె శ్రీను, ఉత్సవసేవా కమిటీ సభ్యులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.



● కల్యాణోత్సవాల్లో భాగంగా నేడు..

స్వామివారి కల్యాణోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం 4.30 గంటల నుంచి 5 గంటల వరకు సుప్రభాత సేవ, ఏడుగంటలకు ఆర్జిత అభిషేకం, అనంతరం సాధారణ ప్రత్యేక దర్శనాలు, సాయంత్రం నాలుగు గంటలకు పంచముఖ ఆంజనేయ స్వామి వాహనం, రాత్రి 8.30 గంటలకు కంచుగరుడ వాహనాలపై స్వామివారి గ్రామోత్సవాలు నిర్వహించనున్నట్టు ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు.

● సర్వం సిద్ధం : ఎస్పీ కృష్ణారావు

స్వామివారి దివ్య కల్యాణోత్సవాల సందర్భంగా బందోబస్తు పరంగా అన్ని ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎస్పీ బీ. కృష్ణారావు తెలిపారు. స్వామివారి కల్యాణ మండపం వద్ద గురువారం బందోబస్తుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ కృష్ణారావు మాట్లాడుతూ కల్యాణం, రథోత్సవం, చక్రస్నానం, తెప్పోత్సవాలకు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటుచేశామన్నారు.. 1600 మంది పోలీసులు శాంతి భద్రతల పరిరక్షణకు స్వామివారి తిరునాళ్ల కోసం కేటాయించామన్నారు. తొమ్మిది విభాగాలుగా కేటాయిస్తూ ఒక ఎస్పీ, ఒక ఏఎస్పీ, 10 మంది డీఎస్పీలు, 40 మంది సీఐలు, 100 మంది ఎస్ఐలు ముఖ్య ఘట్టాల వద్ద విధులు నిర్వహిస్తారు. వన్‌వే రూట్‌ను ప్రతీఒక్కరూ ఫాలో అయ్యేలా పూర్తి స్థాయి భద్రతా చర్యలు ఏర్పాటు చేశామన్నారు. అంతర్వేది పుణ్యక్షేత్రానికి వచ్చే భక్తులు ట్రాఫిక్ రూల్స్ పాటిస్తూ శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా ఆలయ పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచాలన్నారు. 20 డ్రోన్ కెమెరాల పర్యవేక్షణతో పాటు వంద సీసీ కెమెరాలు తీర్థ మహోత్సవాల్లో ఏర్పాటు చేసి కమాండ్ కంట్రోల్ రూములో పర్యవేక్షిస్తున్నామన్నారు. కల్యాణోత్సవానికి వచ్చే భక్తులు సూచిక బోర్డులు ఫాలో అవుతూ కల్యాణ టికెట్ తీసుకుని వారికి కేటాయించిన బ్లాక్‌లో కూర్చొని స్వామివారి కల్యాణాన్ని తిలకించాలన్నారు. కల్యాణోత్సవం, వాహన సేవలు, రథోత్సవంలో బారికేడ్లు ఏర్పాటు చేసి ఎటువంటి తొక్కిసలాట జరగకుండా పూర్తిస్థాయి భద్రతా చర్యలు ఏర్పాటు చేశామన్నారు. ఎన్డీఆర్ఎఫ్, స్పెషల్ పార్టీ, మెరైన్ పార్టీలో తీర్థ మహోత్సవాలతో పాటు బీచ్, స్నాన ఘట్టాల వద్ద బందోబస్తు సిద్ధం చేశామని తెలిపారు. తీర్థ మహోత్సవాలకు వచ్చే భక్తులు ఒరిజినల్ పాస్‌లు మాత్రమే చూపించాలని, డూప్లికేట్ పాస్‌లు చూపించినా, వాడిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అల్లవరం నుంచి స్వామివారి గజమాల యాత్రగా అంతర్వేది ఆలయానికి వచ్చే భక్తులకు బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు.

కార్యక్రమంలో కొత్తపేట డీఎస్పీ ఎస్.మురళీమోహన్, రాజోలు సీఐ నరేష్ కుమార్, ఎస్ఐ కె.దుర్గాశ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



ముస్తాబైన స్వామివారి కల్యాణ మండప ప్రధాన రహదారి



ఉత్సవ ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎస్పీ కృష్ణారావు

రాష్ట్రస్థాయి యూత్ బాస్కెట్‌బాల్ పోటీలకు

తూర్పుగోదావరి జిల్లా జట్ల ఎంపిక





ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా బాలురు, బాలికల జట్టు

రామచంద్రపురం (ద్రాక్షారామ),ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): పిఠాపురంలో ఈనెల 8 నుంచి 11 వరకు జరుగనున్న రాష్ట్ర స్థాయి యూత్ బాస్కెట్‌బాల్ బాలబాలికల చాంపియన్ షిప్ పోటీలకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బాలురు, బాలికల జట్లను ఎంపిక చేశారు. గురువారం స్థానిక కృత్తివెంటి పేర్రాజు పంతులు క్రీడా ప్రాంగణంలో నిర్వహించారు. బాలురు, బాలికల విభాగంలో రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొనే క్రీడాకారులను ఎంపిక చేశారు. కార్యక్రమంలో బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఇన్ ఆంధ్రప్రదేశ్ ప్రధాన కార్యదర్శి గన్నమని చక్రవర్తి, ఉమ్మడి జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి బొజ్జా మాణిక్యాలరావు, రామచంద్రాపురం బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

జేఎన్టీయూకే అభివృద్ధిలో విశ్రాంత ఉద్యోగుల పాత్ర మరువలేనిది

● ఇన్‌చార్జి ఉప కులపతి కేవీఎస్‌జీ మురళీకృష్ణ



జేఎన్టీయూకే వీసీ మురళీకృష్ణతో విశ్రాంత ఉద్యోగులు

జేఎన్టీయూకే, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జేఎన్టీయూ అభివృద్ధిలో విశ్రాంత ఉద్యోగుల పాత్ర మరువలేనిదని ఇన్‌చార్జి ఉపకులపతి కేవీఎస్‌జీ మురళీకృష్ణ అన్నారు. వర్సిటీలోని విశ్రాంత ఉద్యోగుల సంఘ కార్యాలయంలో గురువారం నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విశ్రాంత అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బందిని వీసీ సత్కరించారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు డాక్టర్ పి.విజయ కుమార్ అధ్యక్షత వహించగా సంయుక్త కార్యదర్శి పి.రామారావు, గంగాధర శాస్త్రి, రఘురాం, వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

సెమీ ఫైనల్స్‌కి లాన్ టెన్నిస్ పోటీలు

కాకినాడ అర్బన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): గోదావరి ఆంధ్రప్రదేశ్ లాన్ టెన్నిస్ అసోసియేషన్, ఐటా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆలిండియా అండర్-16 లాన్ టెన్నిస్ పోటీలు గురువారం సెమీఫైనల్స్ దశకు చేరుకున్నాయి. బాలుర విభాగంలో ధ్రువ్ (తమిళనాడు)పై భువన్ (ఏపీ) 6-0 6-1, విన్సెంట్ (ఏపీ)పై తనీష్ (తెలంగాణ) 6-2 6-3 స్కోర్లతో గెలుపొందారు. బాలికల విభాగంలో గౌరిశ్రీ (తెలంగాణ)పై జోషిత (ఏపీ) 6-4, 5-7, 6-4, జోహ (తెలంగాణ)పై నవర్షిక (తెలంగాణ) 6-3, 6-4 స్కోర్లతో విజయం సాధించారు.

పోటీలను లాన్ టెన్నిస్ సంఘ రాష్ట్ర కార్యదర్శి పీవీ రామ్‌కుమార్, చీఫ్ రిఫరీ శివకుమార్ పర్యవేక్షించారు.

అదుపు తప్పిన మోటారుసైకిల్

డివైడర్‌ను ఢీకొని యువకుడి మృతి



గోకవరం, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా గోకవరం మండలంలోని కొత్తపల్లి రోడ్డులో గురువారం ఓ మోటారుసైకిల్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొన్న ఘటనలో ఒక యువకుడు మృతి చెందాడు. కాకినాడ జిల్లా అన్నవరం సమీపంలోని బెండపూడికి చెందిన గోసాల సతీష్(17) తన స్నేహితులతో కలిసి గోకవరం మండలం కొత్తపల్లి గ్రామంలోని అమ్మమ్మ ఇంటికి నాలుగురోజుల కిందట వచ్చాడు. ఈ నేపథ్యంలో గురువారం స్నేహితులతో కలిసి మోటార్‌సైకిల్‌పై వెళ్తున్నాడు. కొత్తపల్లినుంచి జగ్గంపేట వెళ్లే రోడ్డులో ఆదర్శకళాశాల దాటిన తర్వాత మలుపులో మోటార్‌సైకిల్ అదుపుతప్పి ప్రమాదవశాత్తూ రోడ్డు డివైడర్‌ను ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో సతీష్ తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మరణించగా తోటి స్నేహితుడు స్వల్పగాయాలయ్యాయి. సతీష్ మృతిపట్ల స్థానికులు, బంధువులు విలపించారు. గోకవరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కొండ దిగుతారు!



కూనవరంలో కొండలపై కొండరెడ్ల ఇళ్లు

- కూనవరంలో కొండరెడ్లకు పీఎం జన్‌మాన్ కింద ఇళ్లస్థలాల మంజూరు
- కొండలపై నుంచి కిందకు దిగనున్న 9 గ్రామాల్లోని 136 కుటుంబాలు
- స్థలం కోసం అటవీశాఖకు ప్రతిపాదనలు పంపిన గృహనిర్మాణశాఖ

కూనవరం, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): అభివృద్ధికి ఆమడ దూరంలో నివసిస్తున్న కొండరెడ్లు ఇక బాహ్య ప్రపంచంలోకి అడుగుపెట్టనున్నారు. విద్య, వైద్యం ఇప్పటికీ వారికి అందని ద్రాక్షే. ఒకవైపు టెక్నాలజీ శరవేగంగా అభివృద్ధి జరుగుతున్నా, మరో వైపు కొండరెడ్ల జీవన వ్యవస్థ మాత్రం ఎక్కడ వేసిన గొంగలి అక్కడి లాగే ఉంది.

అల్లూరి సీతారామరాజు జిల్లా కూనవరం మండలంలోని కూటూరు గుట్టపై 9కొండరెడ్ల గ్రామాల్లో ప్రజలు నివాసముంటున్నారు. వీరిని కొండలపైనుంచి కిందకి దింపాలని చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వ భరత్ కంకణం కట్టారు. ఇప్పటికే ఆయన ఢిల్లీలోని సంబంధిత శాఖాధికారులతో మాట్లాడి పీఎం జన్‌మాన్ పథకం కింద ఇళ్లు సైతం మంజూరు చేశారు. దీంతో కొండరెడ్లు గ్రామాలైన కలింగమెట్టికి చెందిన పది కుటుంబాలకు కోపిరిమెట్టలో 19 కుటుంబాలకు, ఎలుగులగొందిలో 7 కుటుంబాలకు, తోటమామిడిగొందిలో 15 కుటుంబాలకు, పునులుమామిడిగొందిలో 6 కుటుంబాలకు, చింతగండిలో 15 కుటుంబాలకు, కొత్తకారుమానుకోట 23 కుటుంబాలకు, గబ్బిలాలగొంది 21 కుటుంబాలకు, పాతకారుమానుకోట 20 కుటుంబాలకు మొత్తం 136 కుటుంబాలకు ఇళ్లు మంజూరయ్యాయి. ఇళ్ల కోసం నిర్మాణం కోసం రెండెకరాల భూమి కేటాయించాలని హౌసింగ్‌శాఖ, అటవీశాఖ అనుమతికోసం ప్రతిపాదనలు పంపింది. దీంతో కూనవరం-చింతూరు ప్రధాన రోడ్డు మార్గంలోని కూటూరు బస్టాండ్ దగ్గర స్థలం పరిశీలించారు. వచ్చేఏడాది 2026 నాటికి ఈ ఇళ్లు పూర్తి చేయనున్నారు. కొండరెడ్లకు అన్ని వసతులు కల్పించి వారిని మైదాన ప్రాంతంలోని జనజీవనంలో జీవించేలా బాహ్య ప్రపంచానికి పరిచయం చేయనున్నారు.

ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు

కూటూరు గట్టుపై ఉంటున్న కొండరెడ్ల కోసం ఇళ్లు నిర్మించేందుకు భూమి కేటాయించాలని హౌసింగ్‌శాఖనుంచి అనుమతికోసం ప్రతిపాదనలు వచ్చినట్లు కూనవరం అటవీశాఖాధికారి కరుణాకరన్ ఆంధ్రజ్యోతికి తెలిపారు. దీనికి నివేదిక తయారుచేసి అటవీశాఖ ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపుతానని తెలిపారు. ప్రతిపాదనలు మంజూరుకాగానే స్థలం కేటాయిస్తామన్నారు.

కోళ్ల ఫారాల్లో..
వైరస్ భయం



గండేపల్లి మండలం కె.గోపాలపురంలో ఫారంలో ఉన్న బ్రాయిలర్ కోళ్లు

- ఉమ్మడి జిల్లాల్లో కొత్త వైరస్ ఆందోళన
- పక్క జిల్లాలో కోళ్లు చనిపోవడంతో వణుకు
- బెంబేలెత్తిపోతున్న కోళ్లఫారాల నిర్వాహకులు

గండేపల్లి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): ఎండాకాలం వస్తోందంటేనే బ్రాయిలర్ ఫారాల నిర్వాహకుల గుండెల్లో దడపుడుతోంది. కంటికి రెప్పగా కాపాడుకునే కోళ్లు ఎండల తీవ్రత, వడగాల్పులకు పిట్టల్లా రాలిపోతుంటాయి. రెండేళ్లుగా ఎండాకాలంలో ఫారం నిర్వాహకులు నష్టాలు ఎదుర్కొంటున్నారు. ఈ సంవత్సరం వేసవి భయంతోపాటు వైరస్ భయం కూడా ఫారం నిర్వాహకులను బెంబేలెత్తిస్తోంది. పక్క జిల్లాల్లో వైరస్ తెగులుతో బ్రాయిలర్ కోళ్లు పిట్టల్లా రాలిపోతుండగా మన ఉమ్మడి జిల్లాలో కూడా పలుచోట్ల కోళ్లు చనిపోతున్నాయి. వైరస్ విజృంభిస్తే పరిస్థితి ఏంటని రైతుల్లో ఆందోళన నెలకొంది.

ఉమ్మడి జిల్లాలో కోళ్లఫారాలు

ఫారాల్లో బ్రాయిలర్ కోళ్లను పిల్ల దగ్గర నుంచి 45 - 55రోజుల వరకు కంటికి రెప్పలా కాపాడుకుంటూ వస్తుంటారు. ఎటువంటి తెగులు వ్యాపించకుండా ఎప్పటికప్పుడు వాటికి కావాల్సిన సౌకర్యాలు అందిస్తుంటారు. ఎండాకాలంలో మజ్జిగ, బీట్‌రూట్ జ్యూస్ సైతం కోళ్లకు పెడుతుంటారు. షెడ్లపై చల్లదనానికి ఆకులు వేసి నీటితో తడుపుతూ జాగ్రత్తలు తీసుకుంటారు. కానీ, ఇప్పుడు వ్యాపిస్తున్న వైరస్ మహమ్మారి సోకకుండా పరిరక్షించేందుకు పలు కంపెనీలు ముందుగానే చర్యలు తీసుకోవాలని నిర్వాహకులు కోరుతున్నారు. ఉమ్మడి జిల్లాలోని అనపర్తి, రంగంపేట, సామర్లకోట, జగ్గంపేట, రాజానగరం, మండపేట, రాయవరం తదితర ప్రాంతాల్లో కోళ్ల ఫారల్లో లక్షల సంఖ్యలో కోళ్ల పెంపకం జరుగుతోంది. గండేపల్లి మండలంలో కె.గోపాలపురం, ఎన్టీరాజాపురం, తాళ్లూరు, గోపాలపురం, సుబ్బయ్యమ్మపేట పలు ప్రాంతాల్లో 2లక్షలకు పైగా కోళ్ల పెంపకం జరుగుతోంది. ప్రస్తుతం వైరస్ భయంతో ఫారాల నిర్వాహకులు ఆందోళన చెందుతున్నారు.

వైరస్ సోకుండా చర్యలు తీసుకోవాలి
-యరమళ్ల విష్ణు, ఫారం నిర్వాహకుడు

కోళ్లకు వైరస్ సోకుండానే కంపెనీలు ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలి. ఇప్పటికే కోళ్ల ఫారాల్లో లాభాలు లేక ఇబ్బందులు పడుతున్నాం. వేసవి భయంతోపాటు వైరస్ భయం కూడా భయపెడుతోంది. ప్రభుత్వం మమ్మల్ని ఆదుకోవాలి.

హేచరీలో కేసినో తరహాలో పేకాట



అల్లవరం మండలం కొమరగిరిపట్నంలో ఇటీవల ఓ వైసీపీ నేత హేచరీ వద్ద కేసినో తరహాలో కోడిపందేలు, పేకాటలు

- కోనసీమ జిల్లా అల్లవరం మండలం కొమరగిరిపట్నంలో విందు, వినోదంతో చిందులు
- వైరల్ అయిన వీడియోలు.. స్పందించిన పోలీసులు
- కేసు నమోదు చేశామని అల్లవరం ఎస్‌ఐ ప్రకటన

అమలాపురం, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): పోలీసు యంత్రాంగం ఉదాశీనంగా ఉండడంతో అసాంఘిక శక్తులు పేట్రేగిపోతున్నాయి. కోనసీమ జిల్లా అల్లవరం మండలం కొమరగిరిపట్నంలో వైసీపీ నేతకు చెందిన ఓ హేచరీలో ఇటీవల ఓ పార్టీ జరిగింది. విందు, వినోదాలతోపాటు కేసినో తరహాలో భారీ జూద క్రీడ నిర్వహించారు. కాయిన్లతో ఈ ఆటను నిర్వహించడం దానికి కోనసీమలోని కీలక నాయకులు హాజరైనప్పటికీ పోలీసులు ఆ వ్యవహారాన్ని చూసీచూడనట్టు వదిలేయడం గమనార్హం. అక్కడ జరిగిన విందుతోపాటు కేసినో తరహా జూద క్రీడకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో గురువారం వైరల్ అయ్యాయి. దీంతో పోలీసు అధికారులు స్పందించారు. అందుకు బాధ్యులైన వారిపై కేసులు నమోదు చేస్తున్నట్టు అల్లవరం ఎస్‌ఐ హరీష్ ఒక ప్రకటన చేశారు. పక్కా వ్యూహంతో ఆ హేచరీ వద్ద తరచూ ఈ తరహాలో పేకాట, కోడిపందేలు కేసినో తరహా ఆటలు వంటివి జరుగుతున్నట్టు స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇటీవల జరిగిన జూద క్రీడతోపాటు రాత్రివేళల్లో కోడిపందేలు కూడా నిర్వహించి భారీగా సొమ్ములు కాసినట్టు తెలిసింది. వీడియోలు వైరల్ అవ్వడంతో పోలీసులు విధిలేని పరిస్థితిలో వారిపై కేసులు పెడుతున్నామని వెల్లడించారు. ఈ జూద క్రీడలో పాల్గొనేందుకు కూటమికి చెందిన స్థానికేతర ఎమ్మెల్యే ఒకరు ముఖ్యఅతిథిగా హాజరై ఈ వినోదాలను తిలకించారని సమాచారం. అల్లవరం మండలం కొమరగిరిపట్నంలో హేచరీవద్ద ఘటనలో బాధ్యులైన వారిపై కేసులు నమోదు చేసినట్టు అల్లవరం ఎస్‌ఐ హరీష్ తెలిపారు. వీటిని నిర్వహించడానికి కారకులైన హేచరీ యజమానిపైన కేసు నమోదు చేశామన్నారు. వీడియోల ఆధారంగా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన వారిని గుర్తించి అరెస్టు చేస్తామని ఎస్‌ఐ తెలిపారు. అమలాపురం పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో బుధవారం రాత్రి పేకాట ఆడుతున్న ఓ స్థావరంపై పోలీసులు దాడిచేసి 9 మందిని అరెస్టుచేసి వారి నుంచి రూ.77వేల నగదును స్వాధీనం చేసుకున్నట్టు పోలీసులు తెలిపారు. అమలాపురంతో ఇతర ప్రాంతాల్లో కూడా అనధికారికంగా పేకాట క్లబ్‌లు రహస్య స్థావరాల్లో నిర్వహిస్తున్నారనే ఆరోపణలున్నాయి.

బర్డ్‌ఫ్లూ పట్ల అప్రమత్తంగా ఉండాలి

కాకినాడ జిల్లా పశుసంవర్ధకశాఖ సంయుక్త సంచాలకులు

కలెక్టరేట్(కాకినాడ),ఫిబ్రవరి6(ఆంధ్రజ్యోతి: బర్డ్‌ఫ్లూ వ్యాధిపట్ల అప్రమత్తంగా ఉండాలని కాకినాడ జిల్లా పశుసంవర్ధకశాఖ సంయుక్త సంచాలకులు సూచించారు. ఈ మేరకు ఒక ప్రకటన వెలువరించారు. ఇది ఎక్కువగా కోళ్లు, బాతులు, టర్కీలపై ప్రభావం చూపుతుందన్నారు. ఈ వ్యాధితో మృతి చెందిన కోళ్లను ముట్టుకోవడం, ఆ మాంసం తినడం ద్వారా మానవులకు సోకే అవకాశం ఉందన్నారు. అధిక ఉష్ణోగ్రతలో ఉడికించిన మాంసాన్ని మాత్రమే తినాలన్నారు. పెద్ద మొత్తంలో కోళ్లు మృతిచెందితే తమకుఫిర్యాదు చేయాలన్నారు.

లక్ష్యాన్ని అధిగమించే దిశగా పొల్లూరు జలవిద్యుత్ కేంద్రం



పొల్లూరు జల విద్యుత్ కేంద్రం

మోతుగూడెం, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): సీలేరు కాంప్లెక్స్‌లోని పొల్లూరు జల విద్యుత్ కేంద్రంలో లక్ష్యాన్ని అధిగమించేదిశగా విద్యుత్ ఉత్పత్తి జరుగుతోందని ప్రాజెక్టు డీఈ భీమవరపు బాలకృష్ణ తెలిపారు. సీలేరు నది పరివాహక ప్రాంతంలో ఈఏడాది అత్యధికంగా వర్షాలు కురవడం కలిసి వచ్చిందన్నారు. 2024-25 మార్చికి పొల్లూరు ఉత్పత్తి లక్ష్యం 1084మిలియన్ యూనిట్లు కాగా, ఫిబ్రవరి నాలుగు నాటికి 1020.4మిలియన్ యూనిట్ల ఉత్పాదన జరిగిందని తెలిపారు. ఈ కేంద్రంలో నిత్యం 3.7మిలియన్ యూనిట్లనుంచి 4మిలియన్ యూనిట్ల వరకు విద్యుత్ ఉత్పతి జరుగుతోందని, దీని ప్రకారం ఫిబ్రవరి 25వతేదీ నాటికి లక్ష్యాన్ని అధిగమించి రికార్డు నెలకొల్పే అవకాశాలున్నాయన్నారు. మార్చి నెలాఖరుకు ఈ కేంద్రం నుంచి 100 మిలియన్ యూనిట్లు అదనపు విద్యుత్ ఉత్పత్తి జరుగుతోందని అంచనా వేస్తున్నామన్నారు. సీలేరు కాంప్లెక్స్‌లోని జలాశయాల్లో 50టీఎంసీల వరకు నీటి నిల్వలు ఉన్నాయి. దీంతో రానున్న వేసవిలో సైతం విద్యుత్ ఉత్పత్తికి ఢోకా ఉండబోదని భావిస్తున్నామని తెలిపారు.

రుణాలు తీరకుండానే డ్వాక్రా గ్రూపు ఖాతాల్లో నగదు జమ



రాజవొమ్మంగి మండలం దూసరపాములో విచారణ చేపడుతున్న వెలుగు సీసీలు

- ఆశ్చర్యానికి గురైన డ్వాక్రా సంఘాల సభ్యులు
- విచారణ చేసిన వెలుగు సీసీలు

రాజవొమ్మంగి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): బ్యాంకు నుంచి తీసుకున్న డ్వాక్రా రుణాలు ఇంకా తీరకుండా బ్యాంకు అధికారులు రెండు డ్వాక్రా గ్రూపుల్లోకి నగదు జమ చేశారు. అల్లూరి జిల్లా రాజవొమ్మంగి మండలం దూసరపాము పంచాయతీలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన అరుణ, స్రవంతి గ్రూపులకు రుణం తీరకుండా మళ్లీ వారి గ్రూపు ఖాతాల్లో నగదు జమకావడంపై గ్రూపు సభ్యులు ఒకింత ఆశ్చర్యం, ఆందోళన వ్యక్తం చేశారు. తాము అడగకుండానే నిధులు ఖాతాలో జమ కావడంపై పలు అనుమానాలతో ఏపీఎంకు ఫిర్యాదు చేశారు. దీనిపై గురువారం ఐదుగురు వెలుగు సీసీలు గ్రామానికి విచ్చేసి డ్వాక్రా సంఘాల సభ్యులతో సమావేశమై పరిస్థితి అడిగి తెలుసుకుని విచారణ చేపట్టారు. తమ తీర్మానం లేకుండా తమ గ్రూపు ఖాతాల్లోకి నగదు ఎలా జమైందని అధికారులను ప్రశ్నించారు. రెండు గ్రూపులకు సంబంధించి రూ.40లక్షలు ఖాతాల్లో జమయ్యాయని, దీనికి సంబంధించి వివరాలు వెలుగు అధికారులకు ఇవ్వకుండా నేరుగా బ్యాంకు అధికారుల నేతృత్వంలో జమ చేసినట్లు ఆరోపణలు చేస్తున్నారు. సీసీ మీడియాతో మాట్లాడుతూ సాధారణంగా సంఘ సభ్యుల తీర్మానంతోనే డ్వాక్రా రుణాలు విడుదల చేస్తారని, ప్రస్తుతం ఈ ఘటనలో సంఘ సభ్యులు తెలిపిన ప్రకారం నివేదిక ఏపీఎంకు అందజేస్తామని అన్నారు. ఎక్కడ తప్పిదం జరిగిందో ఉన్నతాధికారుల విచారణలో తేలుతుందన్నారు. దీనిపై పూర్తి వివరణ బ్యాంకు మేనేజర్ దగ్గర తీసుకోవాలన్నారు.

14మంది కేజీబీవీ విద్యార్థినులకు అస్వస్థత



కేజీబీవీ పాఠశాలలో విచారణ చేస్తున్న ఏజెన్సీ డీఈవో మల్లేశ్వరరావు

వై.రామవరం, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా వై.రామవరం మండలం తోటకూరపాలెం కస్తూర్బా విద్యాలయంలోని 14మంది విద్యార్థినులు గురువారం అస్వస్థతకు గురయ్యారు. వారిని చవిటిదిబ్బలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి అంబులెన్సులో తరలించారు. జీర్ణావస్థ ప్రక్రియకు గురికావడంతో వారిలో 8మందికి వాంతులు, ఐదుగురికి లూజ్‌మోషన్లు, గొంతునొప్పి, ఒకరికి కడుపునొప్పి ఉన్నాయని వారికి చికిత్స అందించి స్కూల్‌కు పంపించామని వైద్యాధికారులు డాక్టర్ నరేంద్ర, డాక్టర్ దినేష్ తెలిపారు. దీనిపై పాఠశాల స్పెషల్ ఆఫీసర్ లక్ష్మీని వివరణ కోరగా పాఠశాలలో ఉదయం ఒక విద్యార్థినికి గ్రీన్ కలర్‌లో వాంతు కావడంతో ఆస్పత్రికి పంపించామన్నారు. మిగిలిన విద్యార్థినులను కూడా ఆసుపత్రికి పంపించి పరీక్షలు జరిపించామన్నారు. పాఠశాలలో ఫుడ్ పాయిజన్ జరిగినట్లు విస్తృత ప్రచారం జరగడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఏజెన్సీ డీఈఓ మల్లేశ్వరరావు వెంటనే పాఠశాలకు వచ్చి విచారణ జరిపారు. ఆయన వెంట ఎంఈవో 2 వెంకటరమణ, పాఠశాల స్పెషల్ ఆఫీసర్ లక్ష్మి ఉన్నారు.

ఆటో బోల్తాపడి మహిళకు గాయాలు

జీజీహెచ్ (కాకినాడ), ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఆటో బోల్తాపడి ఓ మహిళ చెవితెగిపడి తీవ్రంగా గాయపడిన ఘటన గురువారం రాత్రి కాకినాడలో చోటుచేసుకుంది. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. కాకినాడ మెయిన్‌రోడ్డు నుంచి ఓ ఆటో ముగ్గురు ప్యాసింజర్లతో జగన్నాథపురంలోని జె.రామారావుపేటకు బయలుదేరింది. ఆటో బ్లూకాన్వెంట్ వద్దకు వెళ్లేసరికి ఆ మలుపులో ప్రమాదవశాత్తూ బోల్తాపడింది. ఈ నేపథ్యంలో జగన్నాథపురానికి చెందిన 50ఏళ్ల చింతా పార్వతి కుడి చెవి తెగి వేరు పడి తీవ్రంగా గాయాపడింది. ఆమెతోపాటు స్వల్ప గాయాలపాలైన మరో ఇద్దరు ప్యాసింజర్లను కూడా స్థానికులు గమనించి జీజీహెచ్‌కు తరలించారు. కాకినాడ వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సామర్లకోట ఆర్టీసీ కాంప్లెక్స్‌లో సెల్ చోరీ

- వెంటనే నిందితుడిని పట్టుకున్న ట్రాఫిక్ ఎస్ఐ

సామర్లకోట, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): కాకినాడజిల్లా సామర్లకోట ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో ప్రయాణికుల నుంచి సెల్‌ఫోన్లు చోరీ చేస్తున్న ఒక వ్యక్తిని సామర్లకోట ట్రాఫిక్ ఎస్ఐ అడపా గరగారావు తన సిబ్బందితో కలిసి గురువారం మధ్యాహ్నం పట్టుకున్నారు. బస్సు ఎక్కేందుకు కాంప్లెక్స్‌కు చేరుకున్న ఒక మహిళ సెల్‌ఫోన్‌ను చోరీ చేసినట్లు ట్రాఫిక్ పోలీసులకు ఫిర్యాదు చేయగా ట్రాఫిక్ ఎస్ఐ సత్వరం స్పందించి సీసీ ఫుటేజీలను పరిశీలించారు. సెల్‌ఫోన్ చోరీ చేసిన వ్యక్తిని గుర్తించి ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలోనే అతని కదలికలపై నిఘా ఉంచి అదుపులోకి తీసుకున్నారు. చోరీకి పాల్పడిన వ్యక్తి పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడుకు చెందిన ప్రేమ్‌కుమార్‌గా పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. అతడిని సామర్లకోట పోలీస్‌స్టేషన్‌కు తదుపరి దర్యాప్తు నిమిత్తం తరలించారు.

చింతూరులో గుండెనొప్పి బాధితుడికి చికిత్స

ప్రభుత్వాస్పత్రిలో ఖరీదైన ఇంజక్షన్

చింతూరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): చింతూరు ఏరియా ఆస్పత్రిలో గుండెనొప్పి బాధితుడికి ప్రాథమిక చికిత్స అందించి ప్రాణాలు నిలబెట్టారు. అల్లూరి జిల్లా చింతూరు మండలం కొత్తపల్లికి చెందిన ఎస్కే. చంటికి గురువారం గుండెనొప్పి వచ్చింది. దీంతో సమీపంలో తులసిపాకల ప్రాథమిక వైద్యశాలకు వెళ్లి పరీక్షలు చేయించుకున్నాడు. అక్కడి వైద్యులు పరిస్థితిని అంచనా వేసి చింతూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఇక్కడ వివిధ పరీక్షలు నిర్వహించిన వైద్యులు చంటికి గుండెపోటుగా నిర్ధారించారు. వెంటనే బాధితుడికి రూ.40వేల విలువైన టెనెక్టిప్లెస్ ఇంజక్షన్ ఇచ్చి ప్రాణాలు నిలబెట్టారు. మెరుగైన చికిత్సకోసం కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. వైద్య సేవలు అందించిన వారిలో ఏరియా ఆస్పత్రి పర్యవేక్షణాధికారి డాక్టర్ కోటిరెడ్డి, డాక్టర్ సాయికిషోర్ పాల్గొన్నారు.

సత్యదేవా నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం



అన్నవరం, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవా నిత్యన్నదాన పథకానికి గురువారం హైదరాబాద్‌కు చెందిన పుణ్యమంతుల సత్యనారాయణ దంపతులు రూ.1,11,600 విరాళంగా సమర్పించారు. ఈ మొత్తాన్ని దాత ఈవో వీర్ల సుబ్బారావుకు అందజేయగా దాతను ఆయన అభినందించి వారికి స్వామి వారి ప్రసాదం, ప్రత్యేక దర్శన సౌకర్యం కల్పించారు.

అనుమతులు లేకుండా ఆలయ నిర్మాణం



అనపర్తి శివారు కొత్తూరు కాలనీలో నిర్మాణంవద్ద బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

- నిర్వాహకులకు నోటీసులు జారీ చేసి విగ్రహ ప్రతిష్ఠను అడ్డుకున్న అధికారులు
- అనపర్తి మండలం కొత్తూరులో 144 సెక్షన్, భారీ పోలీసు బందోబస్తు

అనపర్తి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): అనపర్తి శివారు కొత్తూరుకాలనీలో అనుమతులు లేకుండా వైసీపీనాయకులు నిర్మాణంచేసిన ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ వివాదాస్పదంగా మారింది. కొత్తూరుకు చెందిన వైసీపీ నాయకులు ఆలయాన్ని నిర్మించి 7న విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమమని కరపత్రాలు పంపిణీ చేశారు. దీంతో పంచాయతీ అధికారులు ఆలయ నిర్మాణం చేపట్టిన స్థలంపై ఆరా తీశారు. ఆ స్థలం కాలనీకి చెందిన ప్రభుత్వ భూమిఅని గుర్తించి ఆలయ నిర్మాణానికి అనుమతులు చూపాలని ఆలయ కమిటీని కోరారు. దీంతో వారు అనుమతులు లేవని చెప్పడంతో నిర్వాహకులకు నోటీసులు జారీచేశారు. అనుమతులు పొందిన తర్వాత మాత్రమే మిగిలిన కార్యక్రమాలు నిర్వహించుకోవాలని సూచించారు.ఈ వివాదంపై సోషల్ మీడియాలో అనేక కథనాలు రావడం ప్రజలను రెచ్చగొట్టేలా పోస్టులు రావడంతో అధికారులు స్పందించి ముందస్తు చర్యలు చేపట్టారు. దీనిలో భాగంగా ఆలయం వద్ద ఎటువంటి కార్యక్రమాలు నిర్వహించరాదని బ్యానర్లు ఏర్పాటు చేశారు. తహసీల్దార్ అనిల్ కుమార్, ఎంపీడీవో రామకృష్ణారెడ్డి, అడిషనల్ ఎస్పీ సుబ్బరాజు, ఎస్ఐ శ్రీనునాయక్ ఆధ్వర్యంలో నిర్వాహకులతో సమావేశం నిర్వహించి ఏ కార్యక్రమాలు చేపట్టరాదని తెలిపారు. ఏఎస్పీ సుబ్బారావు మీడియాతో మాట్లాడారు. నిర్వాహకులతో సమావేశం నిర్వహించి అనుమతులు లేకుండా కార్యక్రమాలు చేపట్టవద్దని ఆదేశాలు జారీ చేశామన్నారు. కొత్తూరు కాలనీల్లో 144సెక్షన్ విధించి పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశామన్నారు.

చెత్త ఆటో ఢీకొనడంతో వాహనకారులకు గాయాలు

అంతర్వేది, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా మూడో రోజు రాత్రి శేషవాహనంపై గ్రామోత్సవం నిర్వహిస్తుండగా రెవెన్యూ గెస్ట్ హౌస్ పరిధిలో అటుగా చెత్త తరలిస్తున్న ఆటో వెనుక నుంచి ఢీకొనడంతో నలుగురు వాహనకారులకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల సాయంతో క్షతగాత్రులను మలికిపురంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. దేవస్థానానికి సంబంధించిన చెత్తను తరలిస్తుండగా రాత్రి సమయంలో ఈ సంఘటన చోటుచేసుకోవడం దురదృష్టకరమని, మిగిలిన వాహనకారులు ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామోత్సవం సందర్భంగా ఈ ఘటన జరిగినప్పటికీ మిగిలిన వాహనకారులు శేషవాహనాన్ని గమ్యానికి చేర్చారు.

రాజమహేంద్రవరం

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి

వ్యాధుల నివారణలో ఆరోగ్య విద్య కీలకం

» హెల్త్ ఆర్‌డీ పద్మ శశిధర్ » హెల్త్ ఎడ్యుకేషన్ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ



డైరీ, కేలండర్ ఆవిష్కరిస్తున్న ఆర్డీ డాక్టర్ పద్మ

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): వ్యాధుల ముందస్తు నివారణకు జాతీయ ఆరోగ్యమిషన్ కార్యక్రమాల్లో ఆరోగ్య విద్య ఎంతో అవసరమని వైద్య, ఆరోగ్యశాఖ జోన్-2 రీజనల్ డైరెక్టర్ డాక్టర్ పద్మ శశిధర్ అన్నారు. గురువారం స్థానిక జోన్-2 కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ హెల్త్ ఎడ్యుకేషన్ అండ్ మీడియా ఆఫీసర్స్ అసోసియేషన్ డైరీ, కేలండర్‌ను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆరోగ్యవిద్య ద్వారా ముందస్తుగానే ప్రజలకు అవగాహన కల్గించడం ద్వారా వ్యాధులను అరికట్టవచ్చున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ సురేష్‌బాబు, డిప్యూటీ డెమో సత్యకుమార్ నల్లూరి, అసిస్టెంట్ సాయి, సోషల్ సైన్సెస్ లెక్చరర్ పేరయ్యశాస్త్రి, ప్రసన్న, శ్రీనివాసమూర్తి, ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఎస్‌పీఎం స్టాఫ్ పాల్గొన్నారు.

దుళ్లలో గడ్డివాము దగ్ధం

కడియం, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): దుళ్ల గ్రామంలో రైతు చిట్టూరి వెంకన్నచౌదరికి చెందిన పదెకరాల గడ్డివాము దగ్ధమైంది. బుధవారం రాత్రి 11 సమయంలో దుండుగులు నిప్పుపెట్టడంతో పూర్తిగా గడ్డివాము కాలిపోయిందని రైతు వాపోయారు. ఇటీవల దుళ్లలో కాలువ పూడికతీతలో కాలువ ఆక్రమణల తొలగింపుపై రైతులతో కలిసి వెంకన్నచౌదరి ముందున్నారు. ఈ విషయమై కక్షపూరితంగా గడ్డివాముకు నిప్పుపెట్టారని రైతులు ఆరోపిస్తున్నారు. ఈ ఘటనపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనా స్థలాన్ని కొలుపోటి సత్యనారాయణ, గొడవర్తి ఎర్రబ్బు, ముమ్మిడి దేవీనాగేశ్వరరావు, చిలుకూరి కృష్ణ పరిశీలించారు.

చందన యాత్ర మహోత్సవం



రాజమహేంద్రవరం కల్చరల్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): స్థానిక సింహాచలనగర్ శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి క్షేత్రం చందన యాత్ర మహోత్సవాల్లో భాగంగా గురువారం సాయంత్రం ఎదురు సన్నాహం, తిరుకల్యాణం వైభవంగా జరిగాయి. ఆలయ ధర్మకర్తలు కాలెపు సూర్యసింహాచలం, నాగేశ్వరరావు పర్యవేక్షణలో ఆలయ ప్రధానార్చకులు కల్యాణోత్సవం, నిశా చూర్ణోత్సవం, నవకలశ స్నపనం వంటి ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిపించారు. శుక్రవారం జరిగే స్వామి వారి నిజరూప దర్శనం ఉదయం 6గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

ఆరోగ్య సహాయకులను ప్రభుత్వం ఆదుకోవాలి

ఉద్యోగుల సంఘం రాష్ట్ర కన్వీనర్ ప్రసాద్ వినతి

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తూ ఉద్యోగాల తొలగింపునతో రోడ్డున పడిన ఆరోగ్య సహాయకుల కుటుంబాలను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ పారా మెడికల్ కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం రాష్ట్ర కన్వీనర్ జీవీవీ ప్రసాద్ కోరారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రమంత్రులందరినీ స్వయంగా కలిసి ఆరోగ్య సహాయకులను ఆదుకోవాలని కోరే కార్యక్రమం చేపట్టనున్నామన్నారు. ఉద్యోగాల నుంచి తొలగించి మూడు నెలలు గడిచినా ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేదన్నారు.

మట్టి అక్రమ తవ్వకాలు

లారీ, జేసీబీ సీజ్

కడియం, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): కడియం మండలం పొట్టిలంక గ్రామ పరిధిలోని గోదావరి పరీవాహక ప్రాంతంలో బుధవారం అర్ధరాత్రి అక్రమ మట్టి తవ్వకాలు జరుగుతున్నాయనే సమాచారం రావడంతో పోలీసులు, మైన్స్ అధికారులు దాడులు జరిపారు. ఈ దాడిలో లారీని, మట్టిని తవ్వుతున్న జేసీబీని సీజ్ చేసి మైన్స్ అధికారులకు అప్పగించినట్లు సీఐ ఏ వెంకటేశ్వరరావు తెలిపారు. మట్టిని ఎవరు తవ్వుతున్నారు ? మట్టి తవ్వే ప్రాంత సర్వే నంర్లు ఏమిటి ? అక్రమంగా తరలించిన మట్టి ఎంత ? అనే వివరాలను మైన్స్ అధికారులు విచారణ చేస్తున్నట్లు సమాచారం. ఈ దాడుల్లో మైన్స్ అధికారులు, పోలీసు సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

అగ్నికుల క్షత్రియుల నూతన కార్యవర్గం ఎన్నిక

రాజమహేంద్రవరం కల్చరల్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): అగ్నికుల క్షత్రియుల నూతన కార్యవర్గ ఎన్నిక గురువారం నిర్వహించారు. కుమారి థియేటర్ ఎదురుగా ఉన్న రేవులో నిర్వహించిన సమావేశంలో నూతన అధ్యక్షుడిగా ఆకుల భైరవస్వామి, కార్యదర్శిగా పాలేపు రామానందం, కోశాధికారిగా మల్లాడి రమణ, కర్రి బ్రహ్మాజీ, మరో ఐదుగురు కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు.

10న నులిపురుగుల నివారణ దినం

పోస్టర్ ఆవిష్కరణలో కలెక్టర్ ప్రశాంతి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ప్రశాంతి చిత్రంలో డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటేశ్వరరావు, ఇతర అధికారులు

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని పటిష్ఠంగా అమలు చేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. రాజమహేంద్రవరం (బొమ్మూరు)లోని కలెక్టర్ క్యాంపు కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం రాష్ట్రీయ బాలస్వాస్థ్య కార్యక్రమంలో భాగంగా నులిపురుగుల నివారణ పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. ఫిబ్రవరి 10వ తేదీన జాతీయ నులిపురుగుల నివారణ దినం నిర్వహిస్తున్నామన్నారు. ఈ నెల 10, 17 తేదీల్లో ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. జిల్లాలో 1 నుంచి 19 సంవత్సరాల మధ్య వయసున్న వారికి 10న ఒక మోతాదు, 17న మరో మోతాదు అందించాలని సూచించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, డీఎల్‌డీవో డాక్టర్ ఎన్.వసుంధర, ఐసీడీఎస్ పీడీ కె.విజయకుమారి, జిల్లా ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రాం అధికారి డాక్టర్ హరిశ్చంద్ర ప్రసాద్, డాక్టర్ రాజీవ్, డాక్టర్ అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

3500 మందికి ఉచితంగా కళ్లజోళ్లు

జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమంలో భాగంగా 3,500 మంది విద్యార్థులకు గురువారం ఉచితంగా కళ్లజోళ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించారు. జిల్లాలో 2024 ఆగస్టు నుంచి డిసెంబరు మధ్య 18 ఏళ్ల వయసున్న విద్యార్థులకు స్ర్కీనింగ్ చేయడం ద్వారా కంటి సమస్యలు గుర్తించామన్నారు.

పేదరిక నిర్మూలన దిశగా పి-4 సర్వేచేయాలి

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): పేదరిక నిర్మూలన, విజన్-2047 అంశాల నేపథ్యంలో మార్గదర్శకాలు ప్రకారం సర్వే నిర్వహించాలని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. గురువారం విజయవాడ నుంచి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.విజయానంద్, ఇతర ఉన్నతాధికారులు జూమ్ మీటింగ్‌లో పీ-4 సర్వే ప్రక్రియ, మార్గదర్శకాలు, కలెక్టర్ల ఆధ్వర్యంలో చేపట్టవలసిన చర్యలపై దిశా నిర్దేశం చేశారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్ ప్రశాంతి, రాజమండ్రి కార్పొరేషన్ కమిషనర్ కేతన్‌గార్గ్ పాల్గొన్నారు. జిల్లాలో ఎంఎస్‌ఎంఈ సర్వే విద్యుత్ కనెక్షన్స్ ఆధారంగా చేపడతారని కలెక్టర్ చెప్పారు. జిల్లాలో ఎంఎస్ఎంఈ యూనిట్స్‌కు 92,960 విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయని వాటిలో ఇప్పటివరకు 28,229 సర్వే చేశామన్నారు. మిగిలిన సర్వే ఈ నెల 7నుంచి 22 వరకు జరుగుతుందన్నారు. సమావేశంలో జిల్లా ముఖ్యప్రణాళిక అధికారి ఎల్.అప్పలకొండ, డీపీఆర్వో ఐ.కాశయ్య, జిల్లా పరిశ్రమల అధికారి శ్రీ వణిధర్‌రామన్, సహాయ సంచాలకుడు పి.ప్రదీప్‌కుమార్, డీఆర్డీఏ పీడీ ఎన్వీవీఎస్ మూర్తి, డీపీవో వి.శాంతమణి, డీఎల్‌డీవో పి.వీణాదేవి, డీఈవో కె.వాసుదేవరావు, డీపీఆర్వో లక్ష్మణాచార్యులు పాల్గొన్నారు.

పాఠశాల విద్యను కాపాడాలి

రాజమహేంద్రవరంలో ఏపీ సేవ్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో నిరసన



ఆర్ట్స్ కళాశాల గేటు ఎదుట నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న ఏపీ సేవ్ ఎడ్యుకేషన్ ప్రతినిధులు

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో విద్యావ్యవస్థను పరిరక్షించాలని కోరుతూ గురువారం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ఎదుట ఏపీ సేవ్ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన చేశారు. భాగస్వామ్య సంఘాల నాయకులు మాట్లాడుతూ పాఠశాల విద్యను కాపాడాలని, ఎన్నికల హామీలను నిలబెట్టుకోవాలని కోరారు. ఆవాసానికి 1, 3, 5 కిలోమీటర్ల దూర పరిమితుల్లో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు కొనసాగించాలని నినాదాలు చేశారు. 40 నమోదు దాటిన అన్ని ప్రాథమిక పాఠశాలలకు విద్యాహక్కు చట్టానికి అదనంగా ఆంగ్ల భాషా బోధనకు ఒక పోస్టు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి సునీల్, శశి, యశ్వంత్, ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కేవీవీ సత్యనారాయణ, డేవిడ్ లివింగ్‌స్టన్, ఉదయబ్రహ్మం, అప్పయ్యశాస్త్రి పాల్గొన్నారు.

పేరాబత్తులను గెలిపించండి

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌కు మొదటి ప్రాధాన్య ఓటు వేసి గెలిపించాలని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. గురువారం రాత్రి స్థానిక 15వ డివిజన్‌లో ఆయన ఎన్నికల ప్రచారం చేశారు. పట్టభద్రులైన ఓటర్లు కలిసి కరపత్రాలు అందించి కూటమి అభ్యర్థి పేరాబతులకు ఎందుకు ఓటు వేసి గెలిపించాలో అవగాహన కల్పించారు. పేరాబత్తుల రాజశేఖర్ పేరు ఎదురుగా ఉన్న గడిలో నెంబరు 1 సంఖ్య నురాసి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని, అఖండ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కూటమి నాయకులు క్లస్టర్ ఇన్‌చార్జీలు, డివిజన్ బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

భాష్యంలో ఇంట్రా స్పోర్ట్స్ మీట్

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని టీడీపీ హెల్త్ విభాగం రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ గోరంట్ల రవిరామ్ కిరణ్ అన్నారు. రాజమహేంద్రవరం రైల్వేగ్రౌండ్స్‌లో గురువారం భాష్యం ఇంట్రా జోనల్ బాలికల స్పోర్ట్స్ మీట్ 2025ను ప్రారంభించారు. తొలుత జాతీయ జెండా, స్పోర్ట్స్ జెండా ఆవిష్కరించారు. అనంతరం బాలికలకు కబడ్డీ, కోకో, త్రోబాల్, షటిల్, డోడ్జ్‌బాల్, చెస్, క్యారమ్స్, రన్నింగ్, క్రికెట్ పోటీలు నిర్వహించారు. జోనల్ ఇన్‌చార్జి వి.ఆంజనేయులు మాట్లాడుతూ ఈ మీట్‌లో జిల్లాలో ఏడు బ్రాంచ్‌ల నుంచి 800 మంది క్రీడాకారులు పాల్గొంటారని, శుక్రవారం పోటీలు ముగుస్తాయని.. అనంతరం బహుమతి ప్రదానం చేస్తామని పేర్కొన్నారు.

సోషల్ మీడియాలో తప్పుడు పోస్టులు పెడుతున్న వారిపై ఫిర్యాదు

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): కొంత మంది నకిలి విలేకరులు ది రాజమండ్రి ప్రెస్ క్లబ్ ప్రతిష్ఠకు భంగం కలిగించేవిధంగా సోషల్ మీడియాలో తప్పుడు పోస్టులు పెడుతున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని ప్రెస్‌క్లబ్ గౌరవాధ్యక్షుడు మండేల శ్రీరామ్మూర్తి, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు కుడుపూడి పార్థసారధి, కమిటీ సభ్యులు త్రీటౌన్ సీఐ అప్పారావును కోరారు. ఈ మేరకు గురువారం మధ్యాహ్నం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు అందజేశారు. కొందరు నకిలీలు తాము విలేకరులు, యూట్యూబ్ ఛానళ్ల ఎడిటర్లు, సీఈవోలమని చెప్పి దందాలకు పాల్పడుతున్నారని ఇందులో తమ సంస్థ పేరుతోపాటు అధ్యక్షుడు, గౌరవ అధ్యక్షుడి పేర్లను ప్రస్తావించారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

లతా మంగేష్కర్‌కు నివాళి

రాజమహేంద్రవరం కల్చరల్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): మధుర గాయని లతా మంగేష్కర్ మూడో వర్ధంతిని గురువారం జిత్ మోహన్‌మిత్ర కళావేదికలో నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆర్కెస్ట్రా గాయకులు ఆమె హిట్ గీతాలు పాడి శ్రోతలను అలరించారు. కార్యక్రమంలో కృష్ణారావు, గిరిజాల సోమరాజునాయుడు, వి.జగపతి,బి.సీతారామారావు, నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

లోకాయుక్తలో జీవీఎంసీ సభ్యుల నియామకం ఫిర్యాదు ముగింపు

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): ఏడాదిన్నర కిందట జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుల నియామకానికి జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి నోటిఫికేషన్ జారీచేశారు. ఆసక్తి కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించి పోలీసు విచారణ పూర్తిచేసినా కమిటీ సభ్యుల నియామకం జరగలేదని నగరానికి చెందిన కొంకి రమేశ్ లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు.అయితే తమ నోటీసులకు తూర్పుగోదావరి కలెక్టరు ప్రతి స్పందిస్తూ జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుల నియామకానికి చర్యలు తీసుకున్నామని గతేడాది సెప్టెంబరు 28న అందజేసిన నివేదిక ద్వారా తెలియజేశారన్నారు. సమస్య పరిష్కారం కావడంతో ఫిర్యాదును ముగిస్తున్నామని రిజిస్ట్రార్ లోకాయుక్త ఆఫ్ ఏపీ ఓ ప్రకటనలో తెలిపారు.

కొబ్బరి చెక్కలు, పటిక బెల్లంకు వేలం

బిక్కవోలు, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): బిక్కవోలు లక్ష్మీగణపతి ఆలయంలో గురువారం స్వామికి సమర్పించిన కొబ్బరి చెక్కలు, పటిక బెల్లం, వస్త్రాలకు సంబంధించి బహిరంగ వేలం నిర్వహించారు. వేలంలో కొబ్బరి చెక్కలను రూ.4లక్షల 90వేలకు తోటకూర త్రినాధకృష్ణగంగరాజు, పటిక బెల్లంను రూ. 3లక్షల 70 వేలకు, వస్త్రాలను రూ. లక్షా 17వేలకు వెల్లంకి లక్ష్మీరామచంద్రరావు పాడుకున్నారు. ఈవేలం ఈనెల 8 నుంచి వచ్చే యేడాది ఫిబ్రవరి 7వ తేదీ వరకూ అమలులో వుంటుందని రామచంద్రపురం తనిఖీ అధికారి ఆర్. బాలాజీ రామ్‌ప్రసాద్ తెలిపారు. గత యేడాది కంటే కొబ్బరి చెక్కల్లో రూ.91వేలు, పటిక బెల్లంలో రూ.27వేలు, వస్త్రాల్లో రూ. 9వేలు అధిక ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో ఆకెళ్ల భాస్కర్ తెలిపారు.

పాఠశాల విద్యలో బోధనోపకరణాలు దోహదం

ఏఎంవో రామారెడ్డి

రాజానగరం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) :ఉపాధ్యాయులు రూపొందించే బోధనోపకరణలు విద్యార్థులకు ఉపయుక్తంగా ఉండటమే కాకుండా మంచి ఫలితాలు సాధించేందుకు దోహదపడతాయని కాకినాడ జిల్లా ఏఎంవో రామారెడ్డి పేర్కొ న్నారు. ఎఫ్ఎల్ఎన్ శిక్షణ తరగతుల్లో భాగంగా రాజానగరం మండలం మల్లంపూడిలోని శ్రీసాయిమాధవి ఇంజనీరింగ్ కళా శాలలో ఏర్పాటుచేసిన టీఎల్ఎన్ మేళాలో ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మేళాను ప్రారంభించారు. అనంతరం ఉపా. ధ్యాయులకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. అనంతరం శిక్షణ పొందుతున్న ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు సరికొత్తగా తయారు చేసిన 100కు పైబడిన బోధనోపకరణలు ప్రదర్శనను తిలకించి ఉపాధ్యాయులను అభినందించారు. కార్యక్రమలో కేఆర్‌పీలు వి.మహాలా, కె.ఈశ్వరరావు, జిల్లా కోఆర్డినేటర్ వంశీకృష్ణ, డీఆర్పీలు పాల్గొన్నారు.

ఎస్సీ వసతి గృహాన్ని సందర్శించిన సోషల్ వెల్ఫేర్ డీడీ



విద్యార్థులతో మాట్లాడుతున్న శోభారాణి

గోకవరం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): గోకవరంలోని ఎస్సీ బాలుర వసతిగృహాన్ని సోషల్ వెల్ఫేర్ డీడీ శోభారాణి గురువారం సందర్శించారు. వసతిగృ హంలో విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు గురించి ఆరా తీశారు. విద్యార్థులకు అందిస్తున్న భోజన సదుపాయం అంశాలపై వార్డెన్‌ను అడిగి తెలుసుకున్నారు.

బాలామృతంతో చిన్నారులకు సంపూర్ణ ఆరోగ్యం

● జిల్లాలో కానవరం అంగన్‌వాడీ కేంద్రంలో పైలట్ ప్రోగ్రాం
● ఎంపీడీవో జేఏ ఝాన్సీ, ఇన్‌చార్జ్ సీడీపీవో కనకవల్లి



కానవరంలో బాలామృతం అందజేస్తున్న చేస్తున్న ఎంపీడీవో ఝాన్సీ, ఇన్‌చార్జ్ సీడీపీవో కనకవల్లి

రాజానగరం, ఫిబ్రవరి6(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు సంపూర్ణ ఆరోగ్యాన్ని అందించాలనే సంకల్పంతో కూటమి ప్రభుత్వం బాలామృతంలో మార్పులు చేసినట్లు రాజానగరం ఎంపీడీవో జేఏ ఝాన్సీ పేర్కొన్నారు. తూర్పుగోదావరి జిల్లాలోని రాజానగరం మండలంలో పైలట్ ప్రోగ్రామ్‌గా ఎంపిక చేసిన కానవరంలోని అంగన్‌వాడీ కేంద్రం కోడ్ నెం.0413010లో జూనియర్, సీనియర్ బాలామృతాలను ఎంపీడీవో గురువారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు బరువు పెరగడం కోసం గతంలో ఉన్న బాలామృతంలోని మిశ్రమాల్లో మార్పులు చేశారన్నారు. రాజానగరం ఐసీడీఎస్ ప్రాజెక్టు ఇన్‌చార్జ్ సీడీపీవో టి.కనకవల్లి మాట్లాడుతూ 7నెలల నుంచి సంవత్సరం వయస్సు కలిగిన చిన్నారులకు జూనియర్ బాలా మృతం 1.500 గ్రాములు, 1-3 సంవత్సరాల వయస్సు కలిగిన పిల్లలకు సీనియర్ బాలామృతం 2.500 గ్రాములు 25 రోజులు పాటు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈవిధంగా రోజుకు జూనియర్ బాలామృతం 60 గ్రాములు వంతున, సీనియర్ బాలామృతం రోజుకు 100 గ్రాములు వంతున చిన్నారులకు అందజేస్తారన్నారు. గతంలో అందించే బాలామృతంలోని పంచదార, పాలపొడర్ మిశ్రమాన్ని తొలగించి వేరుశెనగను వేయించి కలిపామన్నారు. 25 రోజులు అనంతరం చిన్నా రులకు మళ్లీ బరువులుచూసి, ఆశించిన ఫలితాలకు అనుగుణంగా రాష్ట్రవ్యాప్తంగా అమలు చేసే దిశగా ప్రభుత్వం యో చిస్తుందన్నారు. కార్యక్రమంలో సెక్టార్ సూపర్‌వైజర్ ఎన్‌కె దుర్గామణి, అంగన్‌వాడీ కార్యకర్త కె.నాగమణి, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బాలాజీ చంద్రమౌళి మృతి విశ్వవిద్యాలయానికి తీరనిలోటు

● నన్నయ ఉపకులపతి ఆచార్య శ్రీనివాసరావు



బాలాజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వీసీ

దివాన్‌చెరువు, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో వివిధ విభాగాలలో విశేషసేవలు అందించిన బాలాజీ చంద్రమౌళి ఆకస్మిక మృతి విశ్వవిద్యాలయానికి తీరనిలోటు అని ఉపకులపతి ఆచార్య వైశ్రీనివాసరావు అన్నారు. నన్నయ విశ్వవిద్యాలయం ప్రాంగణంలోని సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తూ ఆకస్మికంగా మృతిచెందిన జె.బాలాజీ చంద్రమౌళి సంతాపసభ గురువారం విశ్వవిద్యాలయంలో జరిగింది. తొలుత ఆయన చిత్రపటానికి విశ్వవిద్యాలయ అధికారులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పూలమాలలువేసి నివాళులర్పించారు. చిన్న వయస్సులోనే పీహెచ్‌డీ పూర్తిచేయడంతోపాటు పలు అవార్డులను కైవసం చేసుకుని మంచి అధ్యాపకుడిగా పేరు సంపాదించారని వీసీ కొనియాడారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, ప్రిన్సిపాల్ పి.విజయనిర్మల, అధ్యాపకులు ఎ.మట్టారెడ్డి, ఉదయభాస్కర్ ప్రసంగించారు. విద్యార్థులు బాలాజీ చంద్రమౌళికి సంబంధించిన వీడియోలను ప్రదర్శించి వారి స్మృతులను తలచుకుంటూ నివాళులర్పించారు.

తంటికొండ వేంకటేశ్వరస్వామి గిరి ప్రదక్షిణ



గోకవరం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : తంటికొండలో వెలిసిన శ్రీవేంకటేశ్వరస్వామి వారి 65వ బ్రహ్మోత్సవాలు గురువారంతో నాల్గవ రోజుకు చేరుకున్నాయి. ఈసందర్భంగా స్వామి వారికి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, పంచామృతం, మండపారాధన, స్వయంభు పాదానికి అభిషేకాలు చేపట్టారు.

అలాగే శ్రీలక్ష్మీ నారసింహ సహిత మహా సుదర్శన హోమం, విశేష హోమం కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు బద్దిరెడ్డి అచ్చన్న దొర, సువర్ణ తులసి దంపతులచే హోమ క్రతువులు నిర్వహించారు. ఈకార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ బద్దిరెడ్డి అచ్చన్న దొర, కార్యనిర్వహణాధికారి వడ్డాది సత్యనారాయణ, భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి గిరి ప్రదక్షిణలో పాల్గొన్నారు.

ఈవెంట్స్ అండ్ ఎంటర్‌టైన్‌మెంట్స్‌తో ఆర్ట్స్ కళాశాల ఎంవోయూ

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : ఆర్ట్స్ కళాశాలలో విద్యనభ్యసిస్తున్న బీబీఏ (ఈవెంట్ మేనేజ్‌మెంట్) విద్యార్థులకు ప్రయోజనం కలిగేలా హైదరాబాద్‌లోని ఇండలైన్స్ ఈవెంట్స్ అండ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ మీడియాతో అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదుర్చుకున్నాని రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్‌కే తెలిపారు. ఈమేరకు కళాశాలలో జరిగిన ఒక కార్యక్రమంలో ఎంఓయూపై సంతకాలు చేశారు. ఎంఓయూ ద్వారా పరిశ్రమ అనుభవాన్ని అందించేందుకు శిక్షణ, ఇంటర్న్‌షిప్, ఈవెంట్ మేనేజ్‌మెంట్, ప్రచారం, బ్రాండ్ మార్కెటింగ్‌లో ఉద్యోగావకాశాలను కల్పించడం జరుగుతుందని తెలిపారు.

ఆలయాల అభివృద్ధికి నిధులు మంజూరు

● ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి



రామవరంలో ఉమారామలింగేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి మంజూరు పత్రాలను ఆలయ కమిటీకి అందజేస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

అనపర్తి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): అనపర్తి నియోజకవర్గంలోని మూడు ఆలయాల అభివృద్ధికి రూ.3.12కోట్ల నిధులు మంజూరైనట్లు ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తెలిపారు. గురువారం రామవరంలో జరిగిన కార్యక్రమంలో మూడు ఆలయాలకు మంజూరైన నిధుల పత్రాలను ఆయా కమిటీల ప్రతినిధులకు ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అనపర్తి మండలం రామవరంలోని ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి రూ.1.52 కోట్లు, రంగంపేటలోని ఉమారామలింగేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి రూ.1కోటి, వడిశలేరు గ్రామంలోని భజన్నారాయణస్వామి ఆలయానికి రూ.60లక్షల నిధులు మంజూరు చేస్తూ దేవదాయ ధర్మాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి నిధులను మంజూరు చేశారని అన్నారు. కూటమి ప్రభుత్వంలో మొట్టమొదటిగా జరిగిన సీజీఎఫ్ సర్వశ్రేయోనిధి సమావేశంలోనే ఈ నిధులు మంజూరు చేయడం అభినందనీయమని అన్నారు. నిదులు మంజూరు చేసిన మంత్రి ఆనం రామనారాెడ్డి, ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు. .

ప్రజల పట్ల అనుచితంగా ప్రవర్తిస్తే చర్యలు తప్పవు

● ఎంపీడీవో రామకృష్ణారెడ్డి



ఏఎన్ఎంపై వచ్చిన ఫిర్యాదుపై విచారణ నిర్వహిస్తున్న ఎంపీడీవో రామకృష్ణారెడ్డి

అనపర్తి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు వైద్య సేవలు అందించాల్సిన సిబ్బంది ప్రజలపట్ల అనుచితంగా వ్యవహరిస్తే కఠినచర్యలు తప్పవని ఎంపీడీవో ఎం.రామకృష్ణారెడ్డి అన్నారు. బుధవారం అనపర్తిలోని 5వ సచివాలయ పరిధిలో ఏఎన్ఎం రాజేశ్వరిపై వచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం ఆయన వెల్‌నెస్ సెంటర్‌ను పరిశీలించారు. అక్కడ ఏఎన్ఎమ్ తీరును ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు ప్రాథమికంగా వైద్యం అందించడమే కాకుండా చిన్నారులకు అవసరమైన వ్యాక్సిన్ల అందజేసే గురుతర బాధ్యత ఏఎన్ఎమ్‌లకు ఉందని అన్నారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ ఇన్‌చార్జి కార్యదర్శి రాము, ఆశా వర్కర్లు ఉన్నారు.

కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తులను గెలిపించండి

● ఎమ్మెల్యే బత్తుల ఎన్నికల ప్రచారం



నన్నయ విశ్వవిద్యాలయంలో ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే బత్తుల

దివాన్‌చెరువు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : ఎన్‌డీఏ కూటమి బలపరచిన ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరానికి మొదటి ప్రాధాన్యతా ఓటువేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, జనసేన పార్టీ నాసేనకోసం నావంతు కోఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలోని పలు విభాగాలకు చెందిన అధ్యాపకులను, విభాగాధిపతులను, అధ్యాపకులను, ఆచార్యులను గురువారం కలసి ఎన్నికల ప్రచారం చేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు వేగిశెట్టిరాజు, కిమిడిశ్రీరామ్, యర్రంశెట్టి శ్రీను, దేశాల శ్రీను, పిడుగు సురేష్ పాల్గొన్నారు.


అనపర్తి: వచ్చే ఎమ్మెల్సీ ఎన్నికలను కూటమి నాయకులు ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలని ప్రతి 30మంది ఓటర్లకు ఒక నాయకుడు బాధ్యత తీసుకుని కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరంకు ఓటు వేసే విధంగా కృషి చేయాలని గోదావరి తూర్పుడెల్టా ప్రాజెక్టు కమిటీ వైస్‌చైర్మన్ తమలంపూడి సుధాకరరెడ్డి అన్నారు. గురువారం అనపర్తి కూటమి కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో కొవ్వూరి శ్రీనివాసరెడ్డి, కర్రి వెంకటరెడ్డి, అన్నవరం, ఎస్ఆర్‌కె ప్రసాదరెడ్డి, బాసి, మామిడిశెట్టి శ్రీను, మల్లిడి ఆదినారాయణరెడ్డి పాల్గొన్నారు.

పుష్కరాల నిర్వహణకు కొన్ని కీలక నిర్ణయాలు తప్పనిసరి

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో 2027లో జరిగే గోదావరి పుష్కరాలు సజావుగా సాగాలంటే కొన్ని కీలక నిర్ణయాలను రాష్ట్ర ప్రభుత్వం తీసుకోవాలని రాష్ట్ర బీసీ,ఎస్సీ,ఎస్టీ మైనార్టీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు సానబోయిన రామారావు, వైస్‌చైర్మన్ ఎల్‌వి ప్రసాద్,జిల్లా అధ్యక్షుడు జారి అంటోనీ జిల్లా ఇన్‌చార్జి మంత్రి నిమ్మల రామానాయుడుకు విజ్ఞప్తి చేసారు. జిల్లా పర్యటనకు వచ్చిన మంత్రిని వారు గురువారం కలిని వినతి పత్రం అందించారు. అ సందర్భంగా వారు పలు సూచనలు చేశారు.

'బీసీ హాస్టళ్ల సంక్షేమాన్ని విస్మరించిన ప్రభుత్వం'

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం బీసీ విద్యార్థుల పట్ల చిన్నచూపు చూస్తున్నదని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.కిరణ్ కుమార్ విమర్శించారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. బీసీ హాస్టళ్లలో సౌకర్యాలు, విద్యార్థుల సంక్షేమాన్ని విస్మరించిందని ఆరోపించారు. ప్రభుత్వం తక్షణమే బీసీ హాస్టల్ విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.



మంత్రులకు..ర్యాంకులు

మంత్రుల పనితీరుకే కాదు.. ఫైల్స్ క్లియరెన్స్‌కు ర్యాంకులు ఉంటాయి.. తాజాగా ఆ ర్యాంకులను కేటాయించారు. ఇటీవల సీఎం చంద్రబాబు రాష్ట్ర మంత్రులు తమ శాఖల పరిధిలో ఫైళ్లను ఎప్పటికప్పుడు వేగంగా పరిష్కరించాలని దిశానిర్దేశం చేశారు. ఈ మేరకు గురువారం జరిగిన కేబినెట్ సమావేశంలో దీనిపై చర్చించారు. అనంతరం ఫైళ్ల క్లియరెన్స్‌లో మంత్రుల పనితీరు ఎలా ఉందనేదానిపై సీఎం ర్యాంకులు ప్రకటించారు. అందులో భాగంగా తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న కందుల దుర్గేష్ రెండో ర్యాంకులో నిలిచారు.. కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పదో ర్యాంకు.. బీఆర్ అంబేడ్కర్ జిల్లా రామచంద్రపురం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న వాసంశెట్టి సుభాష్ 25 ర్యాంకులో నిలిచారు. ఈ ర్యాంకులను కేబినెట్ సమావేశంలో సీఎం చంద్రబాబునాయుడు స్వయంగా ప్రకటించడం గమనార్హం.

మంత్రి దుర్గేష్



రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి) : ఫైళ్ల క్లియరెన్స్‌లో తూర్పు గోదావరి జిల్లా నిడదవోలు నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్‌కు 2వ ర్యాంకు లభించింది.కూటమి ప్రభుత్వంలో మంత్రులుగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఏ మంత్రి ఎన్ని ఫైళ్లు క్లియర్ చేశారనే దానిపై సీఎం చంద్రబాబు ర్యాంక్‌లు ప్రకటించారు. అందులో మంత్రి కందుల దుర్గేష్‌కు 2వ ర్యాంకు లభించింది.దీనిపై ఆయనను సంప్రదించగా బాధ్యతలు చేపట్టిన తరువాత ఏడు నెలల్లో సుమారు 120 ఫైళ్లు క్లియర్ చేసినట్టు చెప్పారు. తాను పర్యాటక, సాంస్కృతిక, సినిమాటో గ్రఫీశాఖలకు సంబంధించిన ఫైళ్లను క్లియర్ చేశానని, అందులో టూరిజం శాఖకు చెందినవే అధికంగా ఉన్నాయన్నారు. మరింత ఉత్సాహంగా పనిచేయడానికి ఈ ర్యాంకు ప్రోత్సాహాన్నిస్తుందని చెప్పారు.

పవన్‌కల్యాణ్



కాకినాడ, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : జనసేన అధినేత, డిప్యూటీ సీఎం, పంచాయతీ రాజ్,గ్రామీణాభివృద్ధి, అటవీ, పర్యావరణ,సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రి కొణిదల పవన్‌కల్యాణ్ ఫైళ్ల క్లియరెన్స్‌లో 10వ ర్యాంకులో నిలిచారు..పవన్ కల్యాణ్ కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. మంత్రుల ఫైళ్ల క్లియరెన్స్‌పై సీఎం ర్యాంకులు ప్రకటించారు. అందులో భాగంగా డిప్యూటీ సీఎం, మంత్రి పవన్ కల్యాణ్ పదో ర్యాంకులో నిలిచారు. ఇకపై మరింత వేగవంతమైన పనితీరు అందించే క్రమంలో మంత్రులు చురుగ్గా వ్యవహరించాలని సీఎం ఆదేశించారు. పవన్‌కల్యాణ్ అత్యంత కీలకమైన శాఖలు చూస్తున్నారు. వీటికి సంబంధించి ఎప్పటికప్పుడు ఫైళ్లను క్షుణ్ణంగా అధ్యయనం చేసి వాటిని పరిష్కరిస్తున్నారు. అలాగే రాష్ట్ర వ్యాప్తంగా తరచూ పర్యటిస్తూ బిజీబిజీగా గడుపుతున్నారు.ఈ నేపథ్యంలో ఫైళ్ల క్లియరెన్స్‌కు కాస్త ఆలస్యం అవుతున్నా వాటిని పూర్తిగా అధ్యయనం చేస్తున్నారు.

సుభాష్



అమలాపురం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం నుంచి కార్మికశాఖ మంత్రిగా ప్రాతినిధ్యం వహిస్తున్న వాసంశెట్టి సుభాష్ ఫైళ్ల క్రియరెన్సులో చివరిస్థానం 25లో నిలిచారు.కోనసీమకు చెందిన మంత్రి సుభాష్ ఫైళ్ల పరిష్కారంలో చివరిస్థానంలో ఉండడంతో చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికే పార్టీ సభ్యత్వ నమోదు విషయంలో ఒకసారి అధినేత చంద్రబాబునాయుడుతో మందలింపునకు గురైన విషయం పాఠకులకు విదితమే. ఈ నేపథ్యంలో ర్యాంకుల్లోనూ చివర నిలవడంతో మంత్రి సుభాష్ రాగల రోజుల్లో మరింత కష్టించి పనిచేయాల్సి ఉంటుందని ఆయన సన్నిహితులు సూచనలు చేస్తున్నారు. సుభాష్ పనితీరు పట్ల కొన్నివర్గాలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్టు సమాచారం.



అవినీతి.. రత్నాలు!

రత్నగిరిపై అవినీతి రత్నాలు ఉన్నాయి.. ఏళ్లుగా పాతుకుపోయాయి.. గత వైసీపీ ప్రభుత్వంలోనే విజిలెన్స్ అధికారులు వీళ్ల లెక్క తీశారు.. అయినా గత ప్రభుత్వంలో షరా మామూలుగా చర్యల్లేవ్.. ఎన్నికలు రావడం.. ప్రభుత్వం మారడంతో.. ఆ అవినీతి ఫైల్ కూటమి ప్రభుత్వం వద్దకు చేరింది.. ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు అవుతున్నా సత్యదేవుడి చెంత అసత్యం నిగ్గు తేల్చడానికి ఏ ఒక్కరూ ముందుకు రాలేదు.. ప్రాధాన్యత ఉన్న ఆలయంలో ఏళ్లు గడుస్తున్నా అక్రమార్కులపై కనీస చర్యలు లేకపోవడంతో దొంగలంతా దర్జాగా తిరుగుతున్నారు. కొండపై ప్రక్షాళన వట్టిమాటే అన్నట్టు ధీమా ప్రదర్శిస్తూ కూటమిలోనూ చక్రం తిప్పుతున్నారు.

రత్నగిరి కొండపై అక్రమాలకు అడ్డేది

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

అన్నవరం దేవస్థానంలో అవినీతి గుట్టు బయట పడినా అక్రమార్కులపై ఇప్పటికీ చర్యలకు అడుగులు పడడం లేదు.కూటమి ప్రభు త్వం అధికా రంలోకి వచ్చిన కొత్తలో కచ్చితంగా చర్యలు ఉంటాయని భావించినా ఇంకా ఆ దిశ గా ప్రక్షాళన జరగక పోవడం చర్చనీయాంశంగా మారింది. కొండపై పలు రకాల అవినీతి,అక్రమాలు పేరుకుపోయాయని సాక్ష్యా ఆధారాలతో విజిలెన్స్ నివేదిక తయారు చేసి పంపినా గత ప్రభుత్వం కనీసం పట్టించు కోలే దు. పైగా ఇవన్నీ బయట పడితే కొలువులు పోతా యని కొందరు కీలక అధికారులు బెంబే లెత్తిపో యారు. అక్రమాలపై చర్యలు లేకుండా అప్పట్లో తెగ చక్రం తిప్పారు. అయితే కూటమి ప్రభుత్వం రావడం తో విజిలెన్స్ నివేదిక ప్రకారం చర్యలు ఉంటాయని భావిస్తే ఇప్పటికీ సదరు అక్రమార్కులు ఆ నివేదిక బయటకు రాకుండా ప్రభుత్వం కళ్లకు గంతలు కట్టడానికి ప్రయత్ని స్తుండడం విశేషం. మరో పక్క అప్పటి నివేదికలను విజిలెన్స్ అధికారులు కొత్త ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు. కానీ ఇప్పటికీ అక్ర మార్కులపై చర్యలకు దిక్కుదివానం లేదు. వాస్తవా నికి కొండపై అడ్డగోలుగా ఉద్యోగుల భర్తీ, పదో న్న తులు, దుకాణాల లీజులు,ఈవో బంగ్లా నిర్మాణం వర కు అక్రమాలు జరిగినట్టు విజిలెన్స్ తేల్చింది.

ఇన్నేళ్లయినా.. చర్యలేవి!

అన్నవరం దేవస్థానంలో 2019 నుంచి పలు విభాగాల్లో అక్రమాలు భారీగా చోటుచేసుకున్నాయి. ఓ కీలక అధికారి, కొందరు సెక్షన్ ఉద్యోగులతో కుమ్మక్కై అర్చకులు,ఉద్యోగాల నియా మకాల్లో పెద్ద ఎత్తున మేసేశారు. జీతాల పేరుతో దేవస్థానం నిధులను దిగమింగేశారు. బస్సు ల నిర్వహణ, కొండ కింద ఈవో బంగ్లా నిర్మా ణానికి దేవస్థానం నిధుల నుంచి రూ.కోటి వర కు వెచ్చించారు. గోశాల నిర్వహణలోను అక్ర మాలు భారీగా ఉన్నాయి. అడిగేవారు లేరన్న ధీమాతో అప్పట్లో కొందరు అధికారులు, ఉద్యో గులు కలిసి దేవస్థానం సొమ్ములు మింగేశారు. వీటన్నింటిపైనా భక్తుల నుంచి 2021లో అప్పటి ప్రభుత్వానికి భారీగా ఫిర్యాదులు వెళ్లాయి.ఈ నేపథ్యంలో కొండపై అవినీతి భాగోతం తేల్చడా నికి సీఎం కార్యాలయం ఆదేశాలతో విజిలెన్స్ అధికారులు రంగంలో దిగారు. 2021 డిసెంబరు 20 నుంచి విజిలెన్స్ ఎస్పీ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు కొండపై కొన్నిరోజులు దాడులు నిర్వహించాయి. ట్రాన్స్‌పోర్టు,ఉద్యోగుల భర్తీకి సం బంధించి సెక్షన్లలో కీలక అధికారులు,ఉద్యోగుల నుంచి వివరణలు రికార్డు చేసుకున్నారు. దేవ స్థానంలో అక్రమ నియామకాలు, పదోన్నతులు, లీజుల విభాగంలో అక్రమాలు, ఈవో క్వార్టర్ నిర్మాణంలో భారీగా ఆలయ నిధులు మింగేశారనే అంశాలపైనా విచారణ చేపట్టారు.ఈ ఖర్చులకు సంబంధించిన బిల్లులు,ఇతర రికార్డు లను విజిలెన్స్ పరిశీలించింది. దేవస్థానానికి సమీపంలో నిర్మాణంలో ఉన్న కొన్ని భవనాల కొలతలు తీసుకున్నా రు.ఆ తర్వాత ప్రభుత్వానికి 2022లో విజిలెన్స్ పూర్తి నివేదిక పంపింది. కొండపై అనేక అవినీతి, అక్ర మాలు జరిగినట్టు తేల్చింది. రౌతులపూడి మండలం గొందిలో ఆల యానికి 38 ఎకరాల భూమి ఉండగా దానిలో చాలా వరకు అక్రమార్కులు పాగా వేసే శారని దీనికి కొందరు అధికారుల సహకారం ఉందని వివరించింది.బాధ్యులందరిపై చర్యలు తీసుకో వాలని పేర్కొంది.ఈ నివేదికపై చర్యలు తీసుకు ంటే కొలువు పోతుందనే భయంతో ఇక్కడ ఈవోగా పనిచేసి వెళ్లిపోయిన సదరు కీలక అధి కారి విజిలెన్స్ నివేదికపై చర్యలు లేకుండా అప్పటి ప్రభుత్వ పెద్దలను దారికి తెచ్చుకున్నా రు. దీంతో అక్రమాలు బయటపడినా నివేదికను తొక్కి పెట్టేసేలా చేయగలిగారు. అటు ప్రభు త్వం నుంచి ఏమాత్రం స్పందన లేకపోవడంతో విజి లెన్స్ సైతం నెమ్మదిగా ఉండిపోయింది.

ఇప్పుడూ అంతే..చర్యల్లేవంతే..

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చి ఏడు నెల లుపైగానే అయిపోయింది. అయినా ఇప్పటికీ అక్రమార్కులపై చర్యలు లేవు. వాస్తవానికి ప్రభుత్వం వచ్చిన కొత్తలో విజిలెన్స్ అధికా రులు గత ప్రభుత్వంలో అక్రమాలకు సం బం ధించి అన్ని వివరాలు అందించారు.అయినా ఇప్పటికీ అక్రమార్కులపై చర్యలు తీసుకోక పోవడం గమనార్హం. కూటమి ప్రభుత్వంలోను సదరు కీలక అధికారి చక్రం తిప్పుతున్నారనే అనుమానాలున్నాయి.ప్రత్తిపాడు,తుని ఎమ్మె ల్యేలు అసెంబ్లీలో అన్న వరం దేవస్థానం అక్ర మాలపై విజిలెన్స్ నివేదికలు ఏమయ్యాయని నిలదీసి ఉంటే ఈ పాటికి చర్యలకు అవకాశం ఉండేది.కానీ ఈ దిశగా ప్రయత్నాలు లేకపోవడంతో దొంగలు కొండపై తమ దందాలు సాగిస్తున్నారు.విజిలెన్స్ నివేదికను రప్పించు కు ని అక్రమార్కులపై చర్యలు తీసుకునేలా కలె క్టర్ అయినా చొరవ తీసుకోవాల్సి ఉంది.

- అన్నవరంలో అక్రమాలపై నివేదిక
- గత ప్రభుత్వంలో విజిలెన్స్ దాడులు
- నిధుల దుర్వినియోగంపై తేల్చివేత
- గొంది ఆలయ భూములు కబ్జా
- 38 ఎకరాలపై విన్నపం
- ఏళ్లు గడుస్తున్నా మౌనమే
- కూటమిలోనూ అక్రమార్కుల దర్జా
- విజిలెన్స్ నివేదికపై నేటికీ చర్యల్లేవ్
- ఈ సర్కారులోనూ ఇంతేనా?
- ఇప్పటికీ చక్రం తిప్పుతున్న వైనం

నరసన్న కల్యాణం చూతము రారండి!

6

ప్రతి గ్రామంలో మోడల్ స్కూల్ ఉండాలి

విద్యాశాఖ సమీక్షలో కలెక్టర్

రాజమహేంద్రవరం,ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో డ్రాపవుట్స్ లేకుండా చర్యలు తీసుకోవడంతో పాటు ప్రతి గ్రామంలో ఒక మోడల్ ప్రైమరీ స్కూల్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. విద్యాశాఖపై గురువారం ఆమె సమీక్షించారు. ప్రభుత్వ పాఠశాలల్లో డ్రాపవుట్స్ లేకుండా చూడడంలో భాగంగా ఏకీకృత జిల్లా సమాచార వ్యవస్థ(యూడైస్) డేటా, ఫిజికల్ వెరిఫికేషన్ డేటా ఆధారంగా విద్యార్థి వారీగా వివరాలను విశ్లేషణ చేయాలని సూచించారు. గ్రామ స్థాయిలో అం గన్‌వాడీ కేంద్రాలతో ఫౌండేషన్ స్కూల్స్‌ని అనుసంధానం చేయడం ద్వారా అప్ గ్రేడ్ చేస్తే అదనపు బోధనా సిబ్బంది అందుబాటులోకి రావడం సాధ్యమవుతుందన్నారు. సంబంధిత అధికారులు డ్రాపవుట్‌గా ఉన్న విద్యార్థి ఇంటికి వెళ్లి అవగాహన కల్పించి పాఠశాలకు వచ్చే విధంగా చూడాలన్నారు.ఈ కార్యక్రమంలో డీఈవో కె.వాసుదేవరావు, ఎస్ఎస్ఏ పీడీ సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

నీరు -చెట్టు పెండింగ్ బిల్లుల క్లియరెన్స్‌కు సీఎం ఆదేశం

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి6 (ఆంధ్రజ్యోతి) : నీరు చెట్టు పథకం కింద 2019కు ముందు చేసిన పనులకు బిల్లులు చెల్లించకుండా గత వైసీపీ ప్రభుత్వం కాంట్రాక్టర్లను తీవ్ర ఇబ్బందులకు గురి చేసిన సంగతి తెలిసిందే. దీంతో ఇరిగేషన్‌లో పనులంటేనే కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రాని పరిస్థితి ఏర్పడింది. ధవళేశ్వరం ఇరిగేషన్ సర్కిల్ పరిధిలో సుమారు రూ.5 కోట్ల విలువైన 90 బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. కాంట్రాక్టర్ల బాధలు అర్థం చేసుకున్న సీఎం చంద్రబాబు నాయుడు గురువారం జరిగిన కేబినెట్‌లో ఈ అంశంపై చర్చించారు. ఆయా కాంట్రాక్టర్లకు వెంటనే బిల్లులు చెల్లించాలని అధికారులను ఆదేశించారు. దీంతో కాంట్రాక్టర్లు, అధికారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రేపటి నుంచి ధవళగిరి జనార్దనుడి కల్యాణోత్సవాలు



ధవళేశ్వరం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ధవళేశ్వరం.. రాజ మహేంద్రవరం వెళుతుంటే మధ్యలో కనిపించే చిన్నగ్రామం.. ఆ గ్రామంలో గోదావరి చెంతనే ఉంది ఒక కొండ.. ఆ కొండపై స్వయంభూగా వెలసిన దేవుడే శ్రీ భూ నీళా సమేత లక్ష్మీజనార్దన స్వామి. ఆ కొండపైకి వెళితే అంతా ఆహ్లాదమే .. గోదావరి చూస్తూ.. స్వామిని దర్శనం చేసుకుంటే అంతా మనశ్శాంతి.. చాలా మందికి ఈ స్వామి గురించి అంతగా అవగాహన ఉండదు. ఒకసారి వెళ్లి దర్శించుకుంటే మళ్లీ మళ్లీ దర్శించుకోవాలనిపించేలా స్వామి ప్రతిరూపం ఉంటుంది. ఇదే కొండపై ఆంజనేయస్వామి ఆలయంలో సాక్షాత్తూ శ్రీరామచంద్రుడి పాదముద్రలు ఉన్నాయి. ఈ నెల 8వ తేదీ నుంచి ధవళగిరి లక్ష్మీ జనార్దన స్వామి కల్యాణోత్సవాలు వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. శనివారం రథోత్సవంతో మొదలయ్యే ఉత్సవాలు గురువారం పుష్పోత్సవంతో ముగుస్తాయి. ఉత్సవాల్లో భాగంగా ఆలయాన్ని ప్రత్యేకంగా ముస్తాబు చేస్తున్నారు. మెట్ల మార్గాన్ని రంగులతో, విద్యుద్దీపాలతో తీర్చిదిద్దుతున్నారు. దిగువన రామపాదాల ఘాట్ వరకు తాటాకు పందిళ్లు వేసి మామిడి తోరణాలతో అలంకరిస్తున్నారు. ఈ నెల 8న ఏకాదశి రోజున స్వామి వారికి విశేష అర్చనలు, భక్తులకు దర్శనం. రథ సంప్రోక్షణ, కుంభ నివేదన, రథోత్సవం, ధ్వజారోహణ, అంకురార్పన,రాత్రి కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తారు. 9న గరుడ వాహన సేవ, 10న సింహ వాహనసేవ, సదస్యం. 11న అశ్వవాహన సేవ, చోర సంవాదం, 12న పూర్ణాహుతి, చక్రస్నానం,చూర్ణోత్సవం, వసంతోత్సవం, ముత్యాల పల్లకీసేవ,13న ద్వాదశ అర్చనలు, ద్వాదశ ప్రదక్షిణలు, పుష్పోత్సవాలతో ఉత్సవాలు ముగుస్తాయి.

ధర..గెలవలేక!

అరటి గెల..విలవిల





దేవరపల్లి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): అరటి రైతు వెన్ను విరి గింది. గెలలు కొనేనాథుడు లేక.. కొన్నా గిట్టుబాట కాకపోవడంతో లబోదిబోమం టున్నారు. ఈ ఏడాది అరటి ధరలు అంతంతమాత్రంగానే ఉన్నాయి. కలిసిరాకపోతుందా అని రైతులు సాగుకు ఉపక్రమించారు. అయినా లాభాల్లేవ్.. రైతులను నష్టాల బాట పట్టించాయి. జిల్లా వ్యాప్తంగా కొవ్వూరు, ఉండ్రాజవరం, దేవరపల్లి, పెరవలి, గోపాలపురం, కడియం, అనపర్తి, రంగంపేట తదితర మండలాల్లో అరటి సాగు ఎక్కువగా చేస్తా రు.కొవ్వూరులో చక్రకేళీ అరటిని ఎక్కువగా సాగు చేస్తారు. పెరవలి, ఉండ్రాజవరం మండలాల్లో కర్పూర, కూర అరటిగెలలు ఎక్కువగా సాగు చేస్తారు. గతంలో ఉభయ గోదావరి జిల్లాల్లో మాత్రమే అరటి సాగు ఉండేది. ఇప్పుడు విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లోనూ విపరీతంగా అరటి సాగు పెరిగింది. దీంతో ధరలు నేలచూపులు చూస్తున్నాయి. ఉత్పత్తికి తగిన డిమాండ్ లేకపోవడంతో ధరలు పెరగడంలేదు. మరోవైపు జిల్లాలోనూ రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు చూడడం లేదు. దీంతో ధర పెరిగే సూచనలు కనిపించడంలేదు. గతంలో ఉభయ గోదావరి జిల్లాల్లో మాత్రమే అరటి సాగు ఉండడంతో లాభాల పంటగా ఉండేది. నేడు ఎక్కడ పడితే అక్కడ సాగు చేస్తుండడంతో అరటి సాగు చేస్తున్న రైతులు నష్టాల బాటపడుతున్నారు. గతంలో తూర్పుగోదావరి జిల్లా నుంచి అరటి గెలలను ఒడిసా, పశ్చిమ బెంగాల్,తెలంగాణ తదితర రాష్ట్రాలకు ఎగుమతి చేసేవారు. నేడు ఎగుమతులు అంతంతమాత్రంగానే ఉన్నాయి. దీంతో గత కొన్నేళ్లుగా అరటిరైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతుంది. ఈ ఏడాది అంతే.ధరలేక పోవడంతో కర్పూరం గెలలను రైతులు పొలాల్లోనే చెట్టుకు వదిలేస్తున్నారు.మరో వైపు కూర అరటి గెలలు కొనేనాధుడే కనిపించడంలేదని వాపోతున్నారు.గతంలో కూర అరటి గెల రూ.200 - రూ.250 వరకు ధర పలికేది.. గత నవం బర్ నుంచి అరటి రూ.30 - రూ.80 మాత్రమే పలకడంతో రైతులకు కనీసం రవాణా ఛార్జీలు కూడా రాని పరిస్థితి.అయితే బయట మార్కెట్‌లో మాత్రం అరటి కాయల ధరలు దిగిరాలేదు.3 కాయలు రూ.20ల చొప్పున విక్రయించడం గమనార్హం. చక్రకేళి అరటి గెలల పరిస్థితి అలాగే ఉంది. సైకిల్ గెలలు తీసుకెళ్తుంటే రూ.500 నుంచి రూ.600 వరకూ ధర పలుకుతుందని రైతులు వాపోతున్నారు.ఎకరం అరటితోట సాగుచేయాలంటే రూ.లక్ష వరకు ఖర్చు పెట్టాల్సిందే. గెలలు కోసి మార్కెట్‌కు తరలిస్తుంటే కూలి, రవాణా ఖర్చులు కూడా రావడంలేదని రైతులు వాపోతున్నారు.

కూర గెల రూ.40



మూడెకరాల్లో కూర అరటి సాగు చేస్తున్నా. గెల మార్కెట్‌కు తరలిస్తుంటే రూ.40 - రూ.50ధర పలుకుతుంది. దీని వల్ల రవాణా, కూలీ ఛార్జీలు రాని పరిస్థితి. ధర లేక అరటి రైతులు దెబ్బ తింటున్నారు.

- ఎం.వెంకటేశ్వరరావు, అరటి రైతు, కురుకూరు

భార్య ఎడబాటు తాళలేక భర్త ఆత్మహత్య

8

కొవ్వూరు

• కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

కులగణన రీసర్వే చేపట్టాలి

ఏకసభ్య కమిషన్‌కు ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ వినతి



వినతిపత్రం అందజేస్తున్న వెంకట్రావు

కొవ్వూరు, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): మాల, మాదిగల కులగణనలో తప్పులున్నాయని, రీ సర్వే చేపట్టాలని ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ వేమగిరి వెంకట్రావు కోరారు. ఈ మేరకు మంగళగిరిలోని మాదిగ కార్పొరేషన్ కార్యాలయంలో గురువారం ఏబీసీడీ వర్గకరణపై వేసిన ఏకసభ్య కమిషన్ సభ్యుడు రాజీవ్ రంజన్ మిశ్రకు మెమోరాండం అందజేసినట్టు ఆయన తెలిపారు. రాష్ట్రంలో మాదిగల మనోభావాలు తెలియజేస్తూ రీ సర్వే చేపట్టాలని కమిషన్ దృష్టికి తీసుకెళ్లామన్నారు.

లేగదూడల సంరక్షణ చాలా ముఖ్యం

» పశుసంవర్ధకశాఖ ఏడీ రుషిప్రసాద్ » కలవలపల్లిలో లేగదూడల ప్రదర్శన



లేగదూడల ప్రదర్శనను తిలకిస్తున్న అధికారులు, నాయకులు

చాగల్లు, ఫిబ్రవరి 6, (ఆంధ్రజ్యోతి): పశుపోషణలో లేగదూడల సంరక్షణ చాలా బాధ్యతతో కూడుకున్నదని పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకుడు వి.రుషి ప్రసాద్ అన్నారు. గురువారం మండలంలోని కలవలపల్లిలో పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో లేగదూడల ప్రదర్శన, ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 55 లేగదూడలు ప్రదర్శనలో పాల్గొనగా మేలిమి దూడలను పెంచిన రైతులకు బహుమతులు అందజేశారు. శిబిరంలో పాల్గొన్న 42 మంది పాడి రైతులకు పాలక్యాన్‌లు, ఖనిజ లవణ మిశ్రమం ఉచితంగా పంపిణీ చేశారు. గర్భకోశ వ్యాధులకు వైద్యం చేసి మందులు అందజేశారు. చూడి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో పశువైద్యాధికారులు ఎంఎం రాజేష్, సోమశేఖర్, మోహనరావు గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

కూచిపూడి నృత్య ప్రదర్శనలో సింధుప్రియ ప్రతిభ



సింధుప్రియను అభినందిస్తున్న వీవీ రామారావు

చాగల్లు, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీరాజరాజేశ్వరి విద్యాలయంలో 8వ తరగతి విద్యార్థిని తాళ్లూరి సింధు ప్రియ కూచిపూడి నృత్యప్రదర్శనలో చక్కని ప్రతిభను చూపింది. జనవరి 26న అయోధ్య రామమందిరం, 30న వారణాసి గంగాహారతి ఘాట్‌లలో కూచిపూడి నృత్య ప్రదర్శనలు ఇచ్చి బాలరామ పురస్కారం, నటరాజ పాలమంజీరం పురస్కారాలు అందుకుంది. శ్రీమువ్వ గోపాల కల్చరల్ ఆర్ట్స్ ఆకాడమీ ఆహ్వానం మేరకు విశ్వ హిందూ పరిషత్ ద్వారా సింధు ఈ నృత్య ప్రదర్శనలో పాల్గొంది. ఈ సందర్భంగా విద్యార్థినిని పాఠశాల డైరెక్టర్ వల్లిపల్లి వెంకట రామారావు, ఉపాధ్యాయులు అభినందించారు.

మహాలింగేశ్వరస్వామిని దర్శించుకున్న ఎస్పీ



ఎస్పీ కిషోర్‌కు ఆశీర్వచనాలు అందజేస్తున్న వేదపండితులు

దేవరపల్లి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): గౌరీపట్నంలోని శ్రీగౌరీ సమేత మహాలింగేశ్వర స్వామి ఆలయాన్ని గురువారం సాయంత్రం జిల్లా ఎస్పీ నరసింహకిషోర్ సందర్శించారు. ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ఆధ్యాత్మిక వేత్త, సిద్ధాంతి రావిపాటి వరప్రసాద్ ఆశీర్వచనాలు అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు స్వామి వారి చిత్రపటం తీర్థప్రసాదం అందజేశారు. మహాలింగేశ్వరస్వామి ఆలయ ప్రతిష్ఠ ఈ నెల 7న జరగనుంది. ఈ కార్యక్రమానికి పలు గ్రామాల నుంచి 30వేల మంది హాజరవుతారని, వారికి ఆలయ కమిటీ అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేసింది.

వేలివెన్నులో సీతారామయ్య విగ్రహావిష్కరణ



సీతారామయ్య విగ్రహావిష్కరణ చేసిన దృశ్యం

ఉండ్రాజవరం, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని వేలివెన్నులో సిద్ధాశ్రమం వ్యవస్థాపకుడు, మాజీ ఎంపీపీ నందిగం సీతారామయ్య శత జయంతి సందర్భంగా ఆయన విగ్రహాన్ని గురువారం గ్రామంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు సిద్ధాశ్రమం, ఎంపీపీగా సీతారామయ్య చేసిన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా సీతారామయ్య కుమారులు నందిగం సూర్యనారాయణ, జడ్పీటీసీ నందిగం భాస్కరరామయ్య మాట్లాడుతూ మండల వ్యవస్థ ఏర్పడినప్పుడు ఉండ్రాజవరం మండలానికి మొట్టమొదటి ఎంపీపీ ఎన్నికయ్యారని, గ్రామంలో 25 సంవత్సరాలు సర్పంచ్‌గా చేసి పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్టు వివరించారు. శిద్ధాశ్రమానికి నేటికి ఇతర ప్రాంతాల నుంచి వస్తున్నారన్నారు. కార్యక్రమంలో వైద్యుడు తాతిన రామబ్రహ్మం, దాసరి వెంకట్రావు, నిమ్మగడ్డ అచ్యుత రామయ్య, శశి విద్యాసంస్థల చైర్మన్ బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ, పలు విద్యాసంస్థల ప్రిన్సిపాల్స్, డైరెక్టర్లు, నాయకులు పాల్గొన్నారు.

పౌల్ట్రీ రైతుల సమస్యలను పరిష్కరించాలి

మంత్రి అచ్చెన్నాయుడికి ఏపీ పౌల్ట్రీ ఫెడరేషన్ వినతి



మంత్రి అచ్చెన్నాయుడుకు వినతిపత్రం అందజేస్తున్న ఫెడరేషన్ నాయకులు

ఉండ్రాజవరం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఏపీలో ఉన్న పౌల్ట్రీ సమస్యలను వ్యవసాయ, మార్కెటింగ్ శాఖామంత్రి కె.అచ్చెన్నాయుడు దృష్టికి తీసుకెళ్లినట్టు ఏపీ పౌల్ట్రీ ఫెడరేషన్ అధ్యక్షుడు, కాల్ధరి గ్రామ పౌల్ట్రీ యజమాని కోమట్లపల్లి వెంకటసుబ్బారావు గురువారం విలేకరులకు తెలిపారు. ఈ మేరకు విజయవాడలో మంత్రిని కలిసి వినతిపత్రం అందజేసినట్టు పేర్కొన్నారు. పౌల్ట్రీ పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యలు వారి వివరించామని చెప్పారు. ప్రభుత్వం తరఫున సహాయసహకారాలు అందజేస్తామని మంత్రి అచ్చెన్నాయుడు హామీ ఇచ్చినట్టు సుబ్బారావు తెలిపారు. కార్యక్రమంలో ఫెడరేషన్ కమిటీ సభ్యులు జి.గంగాధరరావు, గన్నమని వెంకటసుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఉమారామలింగేశ్వరస్వామి ఆలయంలో పూజలు



ఆలయం వద్ద సామూహిక కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

నల్లజర్ల, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతవరం-కవులూరు రోడ్డులో ఉమారామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠ మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. గురువారం వేదపండితులు సతీష్‌శర్మ, కృష్ణబాబు, సూరిబాబు ఆధ్వర్యంలో గణపతి పూజ, గోపూజ, మండప పూజ, స్వామి, అమ్మవార్లకు హోమాలు, సామూహిక కుంకుమార్చనలు జరిగాయి. శుక్రవారం ఉదయం ధ్వజస్తంభ ప్రతిష్ఠ, అనంతరం అన్నసమారాధన జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యుడు మోతుక్కారి శ్రీనివాస్ తెలిపారు. రూ.2 లక్షల విలువైన గ్రానైట్ ధ్వజస్తంభాన్ని కవులూరుకు చెందిన గద్దే రాఘవులు దంపతులు, నరసింహమూర్తి దంపతులు, భద్రం దంపతులు అందజేసినట్టు చెప్పారు.

కుళాయి నీటికి నో..నో..

» మురుగు నీటి కాలువల చెంతనే తాగునీటి పైపులైన్లు
» తాగునీరు కలుషితమవుతుందేమోనని భయాందోళన
» చుక్కనీరు ముట్టుకోని గోపాలపురం మండల వాసులు



గుడ్డిగూడెంలో డ్రైనేజీలో ఉన్న మోటారు



భీమోలులో డ్రైనేజీలో ఉన్న పైప్‌లైన్‌కి అమర్చిన గేట్‌వాల్



భీమోలులో డ్రైనేజీలో ఉన్న మంచినీటి పైపులైన్



గుడ్డిగూడెంలో డ్రైనేజీలో వృథాగా పోతున్న తాగునీరు

గోపాలపురం, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత రోజుల్లో సర్వరోగాలకు కారణం నీరు కలుషితం అవడమేనని అటు ప్రభుత్వాలు ఇటు నీటి పరిశోధకులు గొంతెత్తి చెబుతున్నా క్షేత్రస్థాయిలో అందుకు భిన్నంగా జరుగుతున్నాయి. మండలంలోని భీమోలు, గుడ్డిగూడెంలో తదితర గ్రామాల్లో మురుగునీరు పారే డ్రైనేజీల చెంతనే రక్షిత మంచినీటి విభాగం ద్వారా తాగునీరు సరఫరా చేస్తున్న గేట్‌వాల్స్, పైపులైన్లు, బోర్లు, నిరంతరాయంగా తాగునీటిని సరఫరా చేస్తున్నాయి. డ్రైనేజీల్లో ప్రవహిస్తున్న నీరు కలుషితం అవుతుందేమోనన్న భయంతో ఆయా గ్రామాల్లో ప్రజలు గ్రామ పంచాయతీల ద్వారా ప్రజల దాహార్తి తీర్చేందుకు సరఫరా చేసే తాగునీటిని కేవలం ఇతర అవసరాలకు ఉపయోగిస్తున్నారు. గొంతెండుతున్నా గుక్కెడు నీళ్లను గొంతులో పోసుకోవడానికి మాత్రం ముందుకు రావడం లేదు. పంచాయతీల ద్వారా సరఫరా చేస్తున్న రక్షిత మంచినీటిని కేవలం ఇతర అవసరాలకు మాత్రమే వినియోగించి దాహార్తి తీర్చుకునేందుకు సత్యసాయి మంచినీటి సరఫరా విభాగం ద్వారా అయ్యే నీటిని, వాటర్‌ప్లాంట్ల నుంచి కొనుగోలు చేసి మరీ దాహార్తి తీర్చుకుంటు న్నారు. ప్రస్తుతం పాలకులు స్థానిక అధికారుల సైతం మంచినీటి సరఫరా విభాగంపై ప్రత్యేక దృష్టి సారించకపోవడమే దీనికి ప్రధాన కారణం. అధికారులు స్పందించి డ్రైనేజీల్లో ఉన్న పైపులైన్లను తొలగించి నూతన పైపులైన్లను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఎమ్మెల్సీగా రాజశేఖర్‌ను గెలిపించాలి

కొవ్వూరు వార్డు సచివాలయాల్లో ఎమ్మెల్యే ముప్పిడి ప్రచారం



సచివాలయం-1లో ఓటు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి

కొవ్వూరు, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌ను గెలిపించాలని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కొవ్వూరులోని 1,2,3,4,5,6,10 వార్డు సచివాలయాల్లో పట్టభద్రులను కలిసి ఓట్లను అభ్యర్థించారు. ఈ సం దర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రంలో చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలను వివరించారు. రాజశేఖర్‌కు మొదటి ప్రా ధాన్య ఓటువేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకుడు గొర్రెల శ్రీధర్, టీడీపీ, జనసేన పట్టణాధ్యక్షులు దా యన రామకృష్ణ, డేగల రామ్‌కుమార్, నాయకులు సూరపనేని చిన్ని, సూర్యదేవర రంజిత్, పిల్లలమర్రి మురళీకృష్ణ, మద్దుల సత్యనారాయణ పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరమ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఉండ్రాజవరంలో కూటమి నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. మొదటి ప్రాధాన్య ఓటును రాజశేఖర్‌కు వేయాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన మండలాధ్యక్షులు సింహాద్రి రామకృష్ణ, వీరమళ్ల బాలాజీ, బీజేపీ నాయకుడు కొప్పిశెట్టి సత్యనారాయణ పాల్గొన్నారు.



ఉండ్రాజవరంలో ప్రచారం చేస్తున్న కూటమి నాయకులు

మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలి

» పోతవరంలో రాస్తోరోకో.. పెద్దల హామీతో విరమణ
» గంట సేపు నిలిచిపోయిన వాహన రాకపోకలు



ఆందోళనకారులతో మాట్లాడుతున్న పోలీసులు

నల్లజర్ల, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): మృతుడు హరిశ్చంద్రప్రసాద్ కుటుంబానికి న్యాయం చేయాలని కుటుంబ సభ్యులు గ్రామస్థులు గురువారం పోతవరం ప్రధాన రహదారిపై చెరకు ట్రాక్టర్ అడ్డు పెట్టి టెంట్ వేసి రాస్తారోకో నిర్వహించారు. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన తానేటి హరిశ్చంద్రప్రసాద్(26)సోమవారం ఉదయం రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా పెద్దలు ట్రాక్టర్ యజమాని నుంచి కొంత ఆర్థిక సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. హామీని అమలు చేయకపోవడంతో గ్రామస్థులు, కుటుంబ సభ్యులు ఆగ్రహంతో రోడ్డుపైకి వచ్చి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అటుగా వస్తున్న చెరకు లోడుతో ఉన్న ట్రాక్టర్‌ను రోడ్డుపై నిలుపుదల చేసి టెంట్ వేసి రాస్తోరోకో నిర్వహించారు. సమాచారం అందుకున్న దేవరపల్లి సీఐ, ఏఎస్ఐ మోహన్ ఆందోళనకారులతో మాట్లాడారు. ప్రయాణికులను ఇబ్బంది పెట్టవద్దని, పెద్దల సమక్షంలో మాట్లాడుకోండి లేనిపక్షంలో రోడ్డుపై ఉన్న చెరకు ట్రాక్టర్‌ను సీజ్ చేస్తామని హెచ్చరించారు. న్యాయం చేస్తామని పెద్దలు హామీ ఇవ్వడంతో రాస్తోరోకో విరమించారు. ఈ నేపథ్యంలో సుమారు గంట సేపు వాహన రాకపోకలు నిలిచిపోయాయి. ఉదయం కావడంతో ఉద్యోగులు, విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. అటుగా వెళుతున్న మాజీ హోం మంత్రి తానేటి వనిత బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించింది.

10న నులి పురుగుల నివారణ దినం

పోస్టర్ ఆవిష్కరణలో కలెక్టర్ ప్రశాంతి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ప్రశాంతి చిత్రంలో డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటేశ్వరరావు, ఇతర అధికారులు

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని పటిష్టంగా అమలు చేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. రాజమహేంద్రవరం (బొమ్మూరు)లోని కలెక్టర్ క్యాంపు కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం రాష్ట్రీయ బాలస్వాస్థ్య కార్యక్రమంలో భాగంగా నులిపురుగుల నివారణ పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించి మాట్లా డారు. ఫిబ్రవరి 10వ తేదీన జాతీయ నులిపురుగుల నివారణ దినం నిర్వహిస్తున్నామన్నారు. ఈ నెల 10, 17 తేదీల్లో ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయనున్నట్టు చెప్పారు. జిల్లాలో 1 నుంచి 19 సంవత్సరాల మధ్య వయసున్న వారికి 10న ఒక మోతాదు, 17న మరో మోతాదు అందించాలని సూచించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, డీఎల్‌డీవో డాక్టర్ ఎన్.వసుంధర, ఐసీడీఎస్ పీడీ కె.విజయకుమారి, జిల్లా ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రాం అధికారి డాక్టర్ హరిశ్చంద్ర ప్రసాద్, డాక్టర్ రాజీవ్, డాక్టర్ అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలన దిశగా పి-4 సర్వేచేయాలి

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): పేదరిక నిర్మూలన, విజన్-2047 అంశాల నేపథ్యంలో మార్గదర్శకాలు ప్రకారం సర్వే నిర్వహించాలని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. గురువారం విజయవాడ నుంచి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.విజయానంద్, ఇతర ఉన్నతాధికారులు జూమ్ మీటింగ్‌లో పీ-4 సర్వే ప్రక్రియ, మార్గదర్శకాలు, కలెక్టర్ల ఆధ్వర్యంలో చేపట్టవలసిన చర్యలపై దిశా నిర్దేశం చేశారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్ ప్రశాంతి, రాజమండ్రి కార్పొరేషన్ కమిషనర్ కేతన్‌గార్గ్ పాల్గొన్నారు. జిల్లాలో ఎంఎస్ఎంఈ సర్వే విద్యుత్ కనెక్షన్ల ఆధారంగా చేపడతారని కలెక్టర్ చెప్పారు. జిల్లాలో ఎంఎస్ఎంఈ యూనిట్లకు 92,960 విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయని వాటిలో ఇప్పటివరకు 28,229 సర్వే చేశామన్నారు. మిగిలిన సర్వే ఈ నెల 7నుంచి 22 వరకు జరుగుతుందన్నారు. సమావేశంలో జిల్లా ముఖ్యప్రణాళిక అధికారి ఎల్.అప్పలకొండ, డీపీఆర్వో ఐ.కాశయ్య, జిల్లా పరిశ్రమల అధికారి శ్రీ వణిధరరామన్, సహాయ సంచాలకుడు పి.ప్రదీప్‌కుమార్, డీఆర్డీఏ పీడీ ఎన్వీవీఎస్ మూర్తి, డీపీవో వి.శాంతమణి, డీఎల్‌డీవో పి.వీణాదేవి, డీఈవో కె.వాసుదేవరావు, డీపీఆర్వో లక్ష్మణాచార్యులు పాల్గొన్నారు.

పాఠశాల విద్యను కాపాడాలి

రాజమహేంద్రవరంలో ఏపీ సేవ్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో నిరసన



ఆర్ట్స్ కళాశాల గేటు ఎదుట నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న ఏపీ సేవ్ ఎడ్యుకేషన్ ప్రతినిధులు

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో విద్యావ్యవస్థను పరిరక్షించాలని కోరుతూ గురువారం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ఎదుట ఏపీ సేవ్‌ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన చేశారు. భాగస్వామ్య సంఘాల నాయకులు మాట్లాడుతూ పాఠశాల విద్యను కాపాడాలని, ఎన్నికల హామీలను నిలబెట్టుకోవాలని కోరారు. ఆవాసానికి 1, 3, 5 కిలోమీటర్ల దూర పరిమితుల్లో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు కొనసాగించాలని నినాదాలు చేశారు. 40 నమోదు దాటిన అన్ని ప్రాథమిక పాఠశాలలకు విద్యాహక్కు చట్టానికి అదనంగా ఆంగ్ల భాషా బోధనకు ఒక పోస్టు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి సునీల్, శశి, యశ్వంత్, ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కేవీపీ సత్యనారాయణ, డేవిడ్ లివింగ్‌స్టన్, ఉదయబ్రహ్మం, అప్పయ్యశాస్త్రి పాల్గొన్నారు.

దేవరపల్లిలో సాయినాథ హోమం



దేవరపల్లి, ఫిబ్రవరి6 (ఆంధ్రజ్యోతి): దేవరపల్లి షిరిడి సాయిబాబా ఆలయం 29వ వార్షికోత్సవంలో భాగంగా గురు వారం ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఉదయం సాయినాథ హోమం, సామూహిక సాయిసత్య వ్రతాలు, పూజలు చేశారు. సాయంత్రం భజన జరిపి, భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ఆకుకూరలే మేలు : సీడీపీవో

చాగల్లు, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): సేంద్రీయ పద్ధతిలో పండించిన ఆకుకూరలే ఆరోగ్యకరమని సీడీపీవో డి.మమ్మి అన్నారు. మండలంలోని చిక్కాల అంగన్‌వాడి కేంద్రం-84లో పోషణ వాటిక కార్యక్రమం నిర్వహించి గర్భిణులు, బాలింతలకు ఆకుకూరలను అందజేశారు. బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సెక్టార్ సూపర్‌వైజర్ పి.పద్మావతి, స్థానిక ప్రజాప్రతినిధులు, అంగన్‌వాడి సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెరవలి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): పెరవలి, మల్లేశ్వరం, కానూరు విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో వార్షిక మరమ్మతుల నిమిత్తం ఈ నెల 7న విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని ట్రాన్స్‌కో ఈఈ ఎన్.నారాయణ అప్పారావు తెలిపారు. ఈ నేపథ్యంలో పెరవలి, ముక్కామల, అజ్జరం, కాకరపర్రు, తీపర్రు, ఖండవల్లి, నల్లాకులవారిపాలెం, అన్నవరప్పాడు, మల్లేశ్వరం, కడింపాడు, పిట్లవేమవరం, కానూరు, కానూరు అగ్రహారం, నడిపల్లి, ఉసులుమర్రు గ్రామాల్లో ఉదయం 8నుంచి మధ్యా హ్నం 1వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు చెప్పారు.

దేవరపల్లి: దేవరపల్లి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని అచ్చెయ్యపాలెం, గొల్లగూడెం, బంధపురం, గ్రామాల్లో ఉదయం 8గంటల నుంచి 2గంటల వరకు విద్యుత్ నిలుపుదల చేయనున్నట్టు ఈఈ ఎస్ఎన్ అప్పారావు తెలిపారు.

భార్య ఎడబాటు తట్టుకోలేక ఆత్మహత్య

నిడదవోలులో రైలు కింద పడి నందిగంపాడు వాసి బలవన్మరణం



నిడదవోలులో రైలు కింద పడి మృతి చెందిన లింగేశ్వరరావు

నిడదవోలు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): భార్య తనను వదిలేసి పదేళ్లుగా దూరంగా ఉండడాన్ని తట్టుకోలేక మద్యానికి బానిసై ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం నిడదవోలులో జరిగింది. స్థానిక చిన కాశీరేవు వద్ద తెల్లవారుజామున చాగల్లు మండలం నందిగంపాడు గ్రామానికి చెందిన అత్కూరి లింగేశ్వరరావు(44) గుర్తుతెలియని రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య అతనిని వదిలేసి పదేళ్లుగా దూరంగా ఉంటోందని, దీంతో మద్యానికి బానిసై ఆత్మహత్య చేసుకున్నట్టు రైల్వే పోలీసులు పేర్కొన్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తాడేపల్లిగూడెం రైల్వే ఎస్ఐ అప్పారావు తెలిపారు.

వృద్ధుడి అదృశ్యం



పల్ల బాలయోగి సుబ్బారావు(ఫైల్)

పెరవలి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండల కేంద్రం మామిడికుదురు గ్రామం నుంచి కానూరులో బంధువుల ఇంటికి వచ్చిన వ్యక్తి స్వగ్రామం వెళతానని బయలు దేరాడని అతడి ఆచూకీ లభించలేదని ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. 70ఏళ్ల వయసున్న పల్ల బాలయోగి సుబ్బారావు ఈ నెల 2న పెరవలి మండలం కానూరులోని ఆయన చెల్లెలు ఇంటికి వచ్చాడు. 3న పశ్చిమగోదావరి జిల్లా పోడూరు మండలం వేడంగిపాలెం వెళతానని ఇంటి నుంచి బయలుదేరి అక్కడకు వెళ్లలేదని, బంధువుల ఇళ్ల వద్ద వెతికినా ఆయన ఆచూకీ లభించలేదని దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

3500 మందికి ఉచితంగా కళ్లజోళ్లు

జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమంలో భాగంగా 3,500 మంది విద్యార్థులకు గురువారం ఉచితంగా కళ్లజోళ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించారు. జిల్లాలో 2024 ఆగస్టు నుంచి డిసెంబరు మధ్య 18 ఏళ్ల వయసున్న విద్యార్థులకు స్ర్కీనింగ్ చేయడం ద్వారా కంటి సమస్యలు గుర్తించామన్నారు.

గడ్డివాము దగ్ధం

కడియం, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): దుళ్ల గ్రామంలో రైతు చిట్టూరి వెంకన్నచౌదరికి చెం దిన పదెకరాల గడ్డివాము దగ్ధమైంది. బుధవారం రాత్రి 11 సమయంలో దుండగులు నిప్పుపెట్టడంతో పూర్తిగా గడ్డివాము కాలిపోయిందని రైతు వాపోయారు.

సినిమా గైడ్

కొవ్వూరు
యువరాజ్ స్ర్కీన్1: సంక్రాంతికి వస్తున్నాం
వై.స్ర్కీన్2 : ఏజెంట్ గయ్ 001
అనన్య : మదగజరాజు

నిడదవోలు
వీ మ్యాక్స్ : మదగజరాజు
రాధాకృష్ణ : సంక్రాంతికి వస్తున్నాం
శ్రీగణపతి : డాకు మహరాజ్

దేవరపల్లి
శ్రీరామ్‌నాథ్ : గేమ్ ఛేంజర్
త్రినాథ్ : డాకూ మహరాజ్